ong-9_ong-9.qxd 4/23/2026 11:43 PM Page 1



## పెండింగ్ హామీల అమలు చేయాలని సీఎంకు గంటా వినతి

**ఆనందపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కోసం భూములిచ్చిన రైతుల పెండింగ్ హామీల అమలుకు అధికారులకు సోచబలివ్వాలని సీఎం చంద్రబాబు నాయుడును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరారు. రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ శంకుస్థాపన కోసం గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలానికి వచ్చిన సీఎంను హెలిప్యాడ్ వద్ద గంటా స్వాగతం పలికారు. గూగుల్ డేటా సెంటర్ కు ఈనెల 28 న శంకుస్థాపన గురించి మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియకు పూర్తి సహకారాన్ని అందించిన రైతుల డి.పట్టా భూములకు రిజిస్ట్రార్ మార్కెట్ విలువ కంటే ఎక్కువగా ఎకరానికి రూ.20 లక్షలకు పెంచడం పట్ల సంతోషంగా ఉన్నారన్నారు. భూములిచ్చిన రైతులకు.. ముందుగా చెప్పిన విధంగా పరిహారాన్ని అందజేయడం జరిగిందని గంటా చెప్పారు. రెండున్నర రెట్ల పరిహారంగా రూ.50 లక్షలు ప్రకటించినప్పటికీ, కొంత భూమి కావాలని రైతులు కోరారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గతంలో చెప్పగా ఎకరానికి 20 సెంట్ల చొప్పున భూమికి నగదు కాకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని ఇవ్వాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. దాంతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం.. ఉపాధి నిమిత్తం షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు.. ప్రకటించారన్నారు. అలాగే సి.ఎల్.డి.పి. కింద 520 మంది రైతులకు 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పినందున దాని అమలు అంశాన్ని పరిశీలించి స్పష్టమైన ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఇంటి పన్ను సమస్యల సవరణకు అవకాశం

**- గాజువాక జోనల్ అసిస్టెంట్ కమిషనర్ రామ్ నారాయణ**

**గాజువాక,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలోని పన్ను చెల్లింపుదారులు తమ ఇంటి పన్నుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు జోనల్ అసిస్టెంట్ కమిషనర్ రామ్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 30 వరకు జోనల్ కార్యాలయంలో వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా డోర్ నంబరు సవరణ, పేర్లలో తప్పులు. ఇంటి పన్ను అధికంగా రావడం, జనరల్ రివిజన్. టైటిల్ ట్రాన్స్‌ఫర్ (యాజమాన్య మార్పిడి), బైఫర్కేషన్. పన్ను మినహాయింపు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు ఈ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గాజువాక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### పాతకొవ్వాడ గ్రామంలో కాలం చెల్లిన మంచినీటి ట్యాంకును ఎవరూ పడగొట్టలేదు

**పద్మనాభం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



మండలంలో పాతకొవ్వాడ గ్రామంలో ఉన్న కాలం చెల్లిన మంచినీటి ట్యాంకును స్థానికులు ఎవరూ పడగొట్టలేదని,దానంతల అదే కూలిపోయిందని ఎంపిడిఒ నగేష, పంచాయతీ విస్తరణ అధికారి బి వి రమణ చెప్పారు.దీనపై తమతో పాటు ఇనచార్జి తహశీల్దారు చంద్రశేఖర్,రెవిన్యూ సిబ్బంది గ్రామాన్ని గురువారం సందర్శించి పడిపోయిన మంచినీటి ట్యాంకును పరిశీలించారు.పూర్తిగా శిధిలమైన ఈ ట్యాంకు ఎవరూ లేని సమయంలో పడిపోవడం ప్రాణనష్టం జరగలేదని స్దానికులు చెప్పారన్నారు. అలాగే ఈ ట్యాంకు శిధిలాలను అధికారులే తొలగించాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ స్థలం జిరాయితీ అని అధికారులు తెలిపారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ విజయ రాఘవ స్వామి ఆలయంలో యాగశాల రాట మహోత్సవం

**గాజువాక,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



జీవీఎంసీ 69వ వార్డు తుంగలాం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ విజయ రాఘవ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం యాగశాల రాట మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. తుంగలాం గ్రామాభివృద్ధి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా రాటను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామాభివృద్ధి, లోక కళ్యాణం కోరి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## తక్కువ బడ్జెట్ లోనే మోటరోలా ఎడ్జ్ ప్రో

**ఆరిలోవ, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**

ప్రపంచ అగ్రగామిగా, భారతదేశ ప్రముఖ ఎ౹ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌గా ఉన్న మోటరోలా ఏజ్ 70 ప్రో ను విడుదల చేసింది. ఈ పరికరంలో మోటో ఎ౹తో కూడిన అధునాతన సోనీలైటియా 710 కెమెరా నేతృత్వంలోని ట్రిపుల్ 50 ఎంపీ ప్రోగ్రేడ్ కెమెరా సిస్టమ్ కలిగి అద్భుతమైన రాత్రి ఫోటోగ్రఫీ, అత్యుత్తమ తక్కువకాంతి స్పష్టత, మసక లేని షాట్లు, పాంటోన్ వాలిడేటెడ్ ట్రూ కలర్స్, స్కిన్‌టోన్ కచ్చితత్వంతో పాటు, అన్ని కెమెరాలలో 4కె 60 ఎఫ్ పి ఎస్ వీడియోను అందిస్తుంది. మోటోరోలా ఎడ్జ్ 70 పిఆర్ఓ, పాంటోన్ క్యూరేటెడ్ రంగులలో విలాసవంతమైన శాటిన్‌లక్స్, టెయిలర్డ్ ఫ్యాబ్రిక్, మార్బుల్ ఫినిషింగ్‌లను కలిగి ఉన్న సరికొత్త ఖికలెక్షన్స్ బై మోటరోలాఖి డిజైన్‌ను కూడా పరిచయం చేస్తోంది. దీనికి జతగా, అద్భుతమైన 144 హెచ్ జెడ్ 1.5కె ట్రూ కలర్ క్వాడ్‌కర్వ్ పాంటోన్ వాలిడేటెడ్ ఎక్స్‌ట్రీమ్ ఎములేర్డ్ డిస్‌ప్లే ఉంది. ఈ సందర్భంగా మోటరోలా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ టి.ఎం. నరసింహన్ మాట్లాడుతూ"మోటరోలాలో మేం, నేటి వినియోగదారులు ఎలా జీవిస్తున్నారు, సృష్టిస్తున్నారు, కనెక్ట్ అవుతున్నారు అనే దానిపై లోతైన అవగాహనతో పాటు ప్రయోజనాత్మక ఆవిష్కరణలను మేళవించడం ద్వారా సంప్రదాయ సరిహద్దులను సవాలు చేస్తూనే ఉన్నామన్నారు. రోజువారీ జీవితాన్ని అర్థవంతమైన రీతిలో ఉన్నతీకరించే ప్రీమియం, డిజైన్‌ఆధారిత, ఎ౹ఆధారిత అనుభవాలను అందించే మా ప్రయాణంలో ఇది మరో ముఖ్యమైన మైలురాయి అని అన్నారు.

## పిల్లలతో సహా అదృశ్యమైన మహిళల ఆచూకీ లభ్యం

**- కుటుంబ సభ్యులకు అప్పగించిన మల్కాపురం పోలీసులు**

**గాజువాక,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన ఇద్దరు మహిళల కేసులను పోలీసులు ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానంతో వారి ఆచూకీ గుర్తించి, చిన్నారులతో సహా సురక్షితంగా కుటుంబ సభ్యులకు గురువారం అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. చింతలలోవ, ఇండస్ట్రియల్ కాలనీ ప్రాంతాలకు చెందిన ఇద్దరు మహిళలు ఇటీవల కుటుంబ కలహాల కారణంగా తమ పిల్లలతో కలిసి ఎవరికీ చెప్పకుండా ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా విశ్లేషణ ద్వారా వారి ఆచూకీ కనుగొన్నారు. గురువారం కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. సత్వరమే స్పందించి కేసులను ఛేదించిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే పోలీసులను సంప్రదించాలని సీఐ గొలగాని అప్పారావు కోరారు.

## శ్రేణులను సన్నద్ధం చేయడమే లక్ష్యం: పసుపులేటి బాలరాజు

**గాజువాక,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



వైకాపాను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు వార్డు సచివాలయ స్థాయి కమిటీల నియామకాన్ని వేగవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజు పిలుపునిచ్చారు. గురువారం గాజువాకలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, వార్డు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు: ఈ నెలాఖరులోగా వార్డు అనుబంధ విభాగాలు, సచివాలయ కమిటీల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలి. ఎంపికైన కమిటీల వివరాలను వెంటనే డిజిటలైజేషన్ చేసి, ఆపై క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేపట్టాలి. నాయకులు, కార్యకర్తలు సమన్వయం తో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మహమ్మద్ ఇమ్రాన్, మార్టుపూడి పరదేశి, పల్లా చిన్నతల్లి, రాజాన వెంకట రావు, కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, అచ్చం నాయుడు, ఎస్ఎండి గౌస్, ధర్మాల శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

## ఎన్‌బీఎం న్యాయ కళాశాల డీన్ డీవీ రమణకు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా సన్మానం

*- ఏయూ శతాబ్ది వేడుకల్లో ఎన్‌బీఎం న్యాయ కళాశాలకి ప్రతిష్టాత్మక గుర్తింపు*

*- ఉత్తమ అనుబంధ కళాశాలగా ఎంపిఐదు అవార్డులతో కళాశాల ప్రతిభ చాటింది*

**విశాఖపట్నం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**




ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం ఏయూ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాయకళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన "లెక్స్ ఎమినెన్స్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్‌బీఎం న్యాయ కళాశాల ఉత్తమ అనుబంధ కళాశాలగా నిలిచి విశేష గుర్తింపు సాధించింది. కళాశాలకు ఐదు ప్రతిష్టాత్మక అవార్డులు లభించగా, డీన్ డా. డీవీ రమణకు దీర్ఘకాల సేవలకు గాను ప్రత్యేక పురస్కారం ప్రదానం చేశారు. ఆయనను వెంకయ్య నాయుడు చేతుల మీదుగా సన్మానించడం విశేషంగా నిలిచింది.వెంకయ్య నాయుడు మాట్లాడుతూ మాతృభాషకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఆంగ్లం అవసరమైన సాధనమాత్రమేనని తెలిపారు. గురువులు, తల్లిదండ్రులు అందించిన విలువలను జీవితాంతం గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివితే ఏ స్థాయికైనా ఎదగవచ్చని తన అనుభవాన్ని ఉదాహరణగా వివరించారు.న్యాయవాదులు సమాజంలో న్యాయం కోసం నిలబడాలని, సైబర్ నేరాలు, మహిళలపై దాడుల నియంత్రణలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో అవకాశాలను యువత వినియోగించుకోవాలని సూచించారు. భారతీయ విలువలను కాపాడుతూ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్‌బీఎం న్యాయ కళాశాల సాధించిన విజయంపై హర్షం వ్యక్తమైంది.

## జనగణనపై విజయవంతంగా ముగిసిన మూడు విడతల శిక్షణా కార్యక్రమం

**పద్మనాభం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



భారత ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం జవగణనపై మండల పరిషత్ సమావేశ మందిరంలో సూపర వైజర్లకు, ఎన్యుమరేటర్లకు మూడు విడతలగా ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం గురువారంతో ఘనంగా ముగిసింది. అయితే జనగణన, ఇండ్లగననపై స్వీయ గణనలకి సంబందించి పలు అంశాలపై ఉపాధ్యాయులు ఎల్ అప్పారావు, కె గణేష్ మూడు విడతలగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని ఎంపిడిఒ నగేష్, ఇనచార్జి తహశీల్దారు చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా జనగణన పూర్తి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్ ఒ గణపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారామాలయానికి ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన

**ఆనందపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ఆనందపురం మండలంలోని సొంట్యాంలో శ్రీ సీతారామాలయం నిర్మాణానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు సహకారంతో దేవాలయం నిర్మాణానికి పనులు ప్రారంభించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిక్కాల విజయబాబు, జి. సుభాష్ చంద్రబోస్, మండల పార్టీ అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, మాజీ ఎంపీటీసీ లోకిరెడ్డి అచ్చిబాబు, జనసేన నాయకులు కోరుకొండ మూర్తి, కోరుకొండ శైలజా, వెంకటరావు,ఆరిపాక రాంబాబు, లెంక రాంబాబు, కోరుకొండ ప్రసాద్, కృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

## పట్టుదలకు ప్రతిరూపం భగీరథుడు ఎమ్మెల్యే పల్లా

**గాజువాక,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



అసాధ్యమైన పనులను సైతం మొక్కవోని దీక్షతో సాధించవచ్చని నిరూపించిన మహనీయుడు భగీరథుడని, ఆయన స్పూర్తి నేటి యువతకు ఎంతో అవసరమని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం గాజువాక 71వ వార్డు దుర్గానగర్‌లోని భగీరథ పార్కులో నిర్వహించిన భగీరథ మహర్షి జయంతి అధికారిక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ..గంగమ్మను భూమికి తెచ్చిన భగీరథుని కృషి మరువలేనిదని, ఏ లక్ష్యమైనా కఠోర శ్రమతోనే సాధ్యమవుతుందని అన్నారు. పనిలో ఎదురయ్యే ఆటంకాలను చూసి వెనకడుగు వేయకుండా ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక బీజేపీ ఇన్చార్జ్ కర్ణంరెడ్డి నరసింహారావు, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ రాజన్ రామారావు,జనసేన నాయకులు కర్ణం కనకారావు, సగర కుల పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆనందపురం మండలంలో స్వచ్ఛ రథం సేవలు

**ఆనందపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్, కమిషనర్ కృష్ణ తేజ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా స్వచ్ఛ రథం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్త నిర్వహణను సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ప్రత్యేకంగా పొడి ఘన వ్యర్థాల సేకరణపై దృష్టి సారిస్తూ, స్వచ్ఛ రథం గ్రామాల వీధి వీధికి, ఇంటింటికి వెళ్లి పనికిరాని ప్లాస్టిక్, పేపర్ మరియు ఇతర ఘన వ్యర్థాలను సేకరిస్తోంది. ప్రజలు ఇచ్చిన వ్యర్థాల విలువ మేరకు నిత్యావసర సరుకులు అందజేయడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తోంది.అలాగే ప్రతి గురువారం స్వచ్ఛ రథం గ్రామంలోని పాఠశాలలను సందర్శించి, అవసరం లేని పుస్తకాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి, వాటి విలువకు అనుగుణంగా విద్యార్థులకు తినుబండారాలు, పెన్లు, పెన్సిల్స్ వంటి సామగ్రి పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత పెరుగుతుండగా, ప్రజల్లో చెత్త వర్గీకరణపై అవగాహన కూడా పెరుగుతోంది. ఆనందపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి జానకి కోలవానిపాలెం గ్రామాన్ని సందర్శించి స్వచ్ఛ రథం పనితీరును పరిశీలించారు. అలాగే ప్రజలు ఈ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు.గ్రామాలు పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంలో స్వచ్ఛ రథం కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు తెలిపారు. ప్రజలు అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గాయత్రి నాయకులు పాల్గొన్నారు.

## వినతుల స్వీకరణ.. తక్షణ పరిష్కారం

**గాజువాక,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం గాజువాక పార్టీ కార్యాలయంలో ఆయన బాధితుల నుంచి విన్నపాలను స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు వార్డుల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించగా, మరికొన్నింటిపై అధికారులతో ఫోన్లో మాట్లాడి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

## వాసుపల్లి జానకిరాంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**విశాఖపట్నం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ఈ నెల 22వ తేదీ ఉదయం .11.గంటల ప్రాంతంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వాసుపల్లి జానకీరామ్ అసోషియేషన్ కార్యాలయంపై సాగించిన దౌర్జన్యం, బెదిరింపు, అసోషియేషన్ ప్రెసిడెంట్గా ప్రకటించుకున్న విషయమై రాష్ట్ర మరపడవల సంఘం తీవ్రంగా ఖండించింది. ఫిషింగ్ హార్బర్లో వై.యస్.ఆర్.సి.పి. కార్యకర్త వాసుపల్లి జానకీరామ్ తన రాజకీయ ఎదుగుదలకు, హార్బర్లో ఆధిపత్యం పెంచుకొనుటకు, మత్స్యకారుల మధ్య వర్గాలను ప్రోత్సహించి గొడవలు సృష్టిస్తున్నాడని ఆయనపై ప్రభుత్వం, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోరారు. 2024ఏప్రిల్ నెలతో ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ బోట్స్ ఓనర్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ గా ఆయన పదవీ కాలం పూర్తి అయినదని మరలా ప్రెసిడెంట్గా కొనసాగుటకు అనేక అక్రమ ప్రయత్నాలు చేశాడన్నారు ,ఆ ఏడాది ఏప్రియల్ 11 నుండి ఆగష్టు వరకు ఎలక్షన్లు పెట్టలేకపోయాడని , బోటు యజమానులు వ్యతిరేకించి అప్పటి జిల్లా కలక్టరుకి ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాలతో పోలీసులు , ఫిషరీష్ అధికారులు దగ్గర ఉండి ఆగష్టు నెల 2024న ఎన్నికలు జరిపించారని తెలిపారు ఆ ఎన్నికల్లో మైలపల్లి లక్ష్మణరావు అసోషియేషన్ ప్రెసిడెంట్గా ఎన్నుకోబడ్డారు. ఈ ఓటమినీ జీర్ణించుకోలేని వాసుపల్లి జానకిరామ్ విశాఖ జిల్లా కోర్టు మరియు హైకోర్టు. నందు రిట్లను ఫైల్ చేశాడు. అసోషియేషన్కు సంబంధిచిన అన్ని రకముల రికార్డులను అషోషియేషన్ ఆఫీస్ నుండి మాయం చేశాడు. ఈరోజు వరకు కూడా అషోషియేషన్ కు సంబంధించిన అకౌంట్స్ గాని, రికార్డు గాని ఇవ్వలేదు. ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ బోట్స్ ఓనర్స్ అసోషియేషన్ ప్రస్తుత పాలకవర్గ సమయం 2026 ఆగష్టు నెలతో ముగియనున్నది. ఆయన దౌర్జన్యంతో వ్యక్తిగంతగా ఒక అసోసియేషన్ ప్రెసిడెంట్గా ప్రకటించుకొన్నాడు. అసోషియేషన్పై కోర్టుకు వెళ్ళినందుకు, ఆయన నూతనంగా సంఘం ఏర్పాటు చేసుకొన్నందున ఆయనకు ప్రస్తుత పాలనవర్గంనకు, అసోషియేషన్ తో ఏవిధమైనా సంబంధం లేదు. వాసుపల్లి జానకీరామ్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా రాష్ట్ర నాయకులను తిట్టడం, బోటు యజమానులను రెచ్చగొట్టడం వెనుక ముఖ్య ఉద్దేశ్యం ఏదో విధముగా పోలీసు కేసులు తనపై పెట్టించుకుని, ఆ కేసులను ప్రచారం చేసుకొని లబ్ది పొందే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయనపై తాము న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మరపడవల సంఘం గౌరవ అధ్యక్షులు పి.సి. అప్పారావు,అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి సురపతి నరసింగరావులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నేతలు మున్నం బాలాజీ, వాసుపల్లి ఎల్లారావు, ఎస్. రాము, కోనాడ చిన్నా, మట్టా రాజు (కె.ఎఫ్. రాజు), జి, రాజేష్, ఎస్. గురుప్రసాద్, చొక్కా రాజు, యాగ శ్రీను, కాకి శ్రీను, మద్దు నూకరాజు, జి. గరగయ్య,పి. గడ్డయ్య, పి. ధన మైలపల్లి మసేను, తదితర పాలక వర్గం మరియు బోటు ఓనర్లు అందరూ పాల్గొన్నారు.

## 25న హనుమాన్ శోభాయాత్ర: గోడపత్రిక ఆవిష్కరణ

**గాజువాక, ఏప్రిల్ 23,ప్రభాతవార్త**




విశాఖ బీచ్ రోడ్డులో ఈనెల 25న నిర్వహించనున్న శ్రీ హనుమాన్ శోభాయాత్ర గోడపత్రికను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీజేపీ నేతలు పరశురామరాజు, కరణంరెడ్డి నరసింగరావు ఆవిష్కరించారు. శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు గాజువాక వంటిల్లు కూడలి నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై ఎన్ఏడీ మీదుగా బీచ్ రోడ్డు వరకు సాగుతుందని వారు తెలిపారు. అనంతరం పార్క్ హోటల్ నుంచి కాళీమాత ఆలయం వరకు మేళతాలాలతో పల్లకి సేవ, శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరసపల్లి నూకరాజు, రోహిణి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రామకోటి ఆశ్రమం

**- దుర్గా కాశీ విశ్వేశ్వర ఆలయాల వార్షికోత్సవాలు**

**పద్మనాభం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



మండలంలో మద్దిగ్రామంలో లక్ష్మినాయుడు కళ్లాల వద్ద ఉన్న రామకోటి ఆశ్రమం దశమ, దుర్గా కాశీ విశ్వేశ్వర ఆలయ చతుర్ది వార్షికోవాలను ఆశ్రమ పీఠాధిపతి, అఖిలాంధ్ర సాదు పరిషత్ అధ్యక్షులు పరమాత్మ నందగిరి స్వామి,ఆలయ ధర్మకర్త కనకల బంగారునాయుడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విశ్వేశ్వరస్వామికి,దుర్గామాతకి అభిషేకాలు, ప్రత్యేక పూజలను బంగారునాయుడు దంపతులతో ఆలయ అర్చకులు నిర్వహించారు.అక్కడే ఏర్పాటు చేసిన సభలో పరమాత్మనందగిరిస్వామితో పాటు మరికొందరు స్వాములు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మం ప్రకారం ప్రతి ఒక్కరు ధర్మంగా నడుచుకొంటే సమాజంలో శాంతి నెలకొంటుందని హిత బోధ చేసారు. అనంతరం ఎంపీపీ రాంబాబు, గ్రామ నాయకులు బంగారునాయుడు,బి సత్యనారాయణ, నగేష,సన్నిబాబు, సన్యాసినాయుడు,ప్రకాష స్వామిని గజమాల,శాలువలతో సత్కరించారు.అనంతం భక్తులు సహకారంతో బారీ అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో సిపిఎం నాయకులు

**ఆనందపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**





ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ఏర్పాటు కానున్న నేపథ్యంలో రైతులను పరామర్శించేందుకు వెళ్లిన సిపిఎం నాయకులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల సీపిఎం ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన సుమారు 520 మంది రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించిన తర్వాతే గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తర్లువాడ గ్రామంలో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలతో సిపిఎం బృందం గ్రామాన్ని సందర్శించగా, పోలీసులు వారిని గ్రామంలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. రైతులతో ఎటువంటి సమావేశం నిర్వహించనీయకుండా సిపిఎం నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకుని, జీపుల్లో ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిలో 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, సిఐటియు భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్. మూర్తి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గంగారావు, ఆర్.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ, రైతులతో మాట్లాడే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని విమర్శించారు. బలవంతపు అరెస్టులు చేయడం తగదని పేర్కొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

**ఆనందపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం వేములవలసలోని ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యాలయంలో గురువారం నూతన లైబ్రరీ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ అడ్వైజర్ కోన ప్రకాష్ వివిధ రకాల పుస్తకాలను లైబ్రరీకి బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషి జ్ఞానాన్ని పెంపొందించే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పఠన అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. జంగం ప్రశాంత్ మాట్లాడుతూ తలదించుకుని పుస్తకాలు చదివితే, తల ఎత్తుకునే స్థాయికి తీసుకెళ్తాయని అన్నారు. పుస్తకాలకు మించిన గురువులు లేరని, అవి మన జీవితాన్ని మారుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి పడాల వినోద్, గొట్టుముక్కల రఘుబాబు, గౌరీ శంకర్, ఆఫీస్ సిబ్బంది సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ong-10_ong-10.qxd 4/23/2026 11:44 PM Page 1






## ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మర్యాదపూర్వకంగా కలిసిన, రమేష్ నాయుడు, శ్రీనివాస్..

**ఎలమంచిలి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త):**





నియోజకవర్గం రాంబిల్లి లో ఎనర్జీ గ్లోబల్ చెందిన రెండు ప్లాంట్లకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఎలమంచిలి మున్సిపాలిటీకి చెందిన జనసేన నాయకులు వూటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చలు అందజేశారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మర్యాదపూర్వకంగా కలిసిన కరణం రవికుమార్..

**ఎలమంచిలి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త):**



నియోజకవర్గం రాంబిల్లిలో రెన్యు సోలార్ ఎనర్జీ గ్లోబల్ సంస్థ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పట్టణ తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్

## రామచంద్రమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్..

**ఎలమంచిలి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త):**



పట్టణంలోని ధర్మవరంలో గల రామచంద్రమ్మ అమ్మవారి మెరుపుల మహోత్సవం సందర్భంగా గురువారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్కు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, కోటారు నరేష్ పాల్గొన్నారు.

## ఉపమాక పంచాయతీ పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు పలికిన గ్రామస్తులు

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**





మండలంలోని ఉపమాక గ్రామ పంచాయతీ సర్పంచ్ తోపాటు పాలకవర్గ సభ్యుల పదవీ కాలం ముగిసిన సందర్భంగా గ్రామస్తులు సచివాల యంలో సచివాల యంలో వారి సేవలను కొనియా డుతూ ఘనంగా సత్కరించారు . గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడుతూ పదవీకాలం ముగిసేం తవరకు ఇంచార్జి గా వ్యవహరించిన మాజీ సర్పంచ్ ప్రగడ వీరబాబు తో పాటు పాలకవర్గ సభ్యులు పొన్నాడ ఉమా, తోటకుమారి, పోలవరపు గోవిందు, గోగులపాటి గుర్రాజు, మామిడి చంద్రయ్య, మామిడి రవణమ్మ, ఎలమంచిలి వెంకటేష్,కోన అప్పారావు, మన బాల లక్ష్మి, యిసరపు లక్ష్మి,బొడ్డపు రాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండపరిషత్ ఏ ఓ దెందుకూరి సీతారామరాజు, చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్ లు మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గం గ్రామాభివృద్ధిలో ఎంతో కృషి చేశారని అన్నారు . ఈ కార్యక్రమంలో ఉపమాక గ్రామ టిడిపి అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీను, టీడీపీ, జనసేన నాయకులు గుద్దాటి సత్యనారాయణ,గొర్ల రవి, కొంకిపూడి దొరబాబు, కోరుకొండ వరాహలరావు,ఎలమంచిలి బుజ్జి,ఎలమంచిలి జోగారావు ఎలమంచిలి శ్రీను, కొప్పిశెట్టి వాసు, తోలేటి శ్రీనివాస్, తోట అప్పారావు, పాము గణేష్,ఎలమంచిలి చంద్రరావు, మామిడి బాబ్జి,మనబాల బుజ్జి, గోకులపాటి కనక, మేడిశెట్టి దుర్గ పాల్గొన్నారు.

## ఢిల్లీ స్థాయిలో అనకాపల్లి నేత హవా

### - ముస్తఫా ఆరిఫ్ ఖాన్‌తో ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) మర్యాదపూర్వక భేటీ

**అనకాపల్లి ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):**



రాజకీయాల్లో హుందాతనం, సేవా పథంలో నిరంతర ప్రయాణం కలగలిసిన వ్యక్తిత్వం ఎం వి ఆర్ ట్రస్ట్ అధినేత, బీజేపీ ముఖ్య నాయకుడు ముత్యాల వెంకటేశ్వరరావు(ఎం వి ఆర్). తాజాగా, ఆయన ఢిల్లీ రాజకీయ వర్గాల్లో , కేంద్ర స్థాయి కీలక నేతల వద్ద తనకున్న ప్రత్యేకతను మరోసారి చాటుకున్నారు. బీహార్ గవర్నర్, భారతీయ జనతా పార్టీ అగ్రనేత ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తనయుడు ముస్తఫా ఆరిఫ్ ఖాన్ ను ఢిల్లీ లో ఎం వి ఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ భేటీ సందర్భంగా ముస్తఫా ఆరిఫ్ ఖాన్ ను ఎం వి ఆర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కేంద్ర రాష్ట్ర స్థాయి నేతలందరితో ఎంతో సన్నిహితంగా, ఆప్యాయంగా ఉండే ఎం వి ఆర్ ఈ పర్యటనలో తనదైన ముద్ర వేసారు. ముఖ్యంగా ఎంవి ఆర్ ట్రస్ట్ ద్వారా అనకాపల్లి ప్రాంతంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు, పేదలకు అందుతున్న అండ గురించి ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఎం వి ఆర్ చేస్తున్న సామాజిక కృషిని ముస్తఫా ఆరిఫ్ ఖాన్ అభినందించినట్లు సమాచారం. కేవలం రాజకీయాలే కాకుండా, సమాజ శ్రేయస్సే పరమావధిగా సాగుతున్న ఎంవి ఆర్ ప్రస్థానం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో బిజెపి బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. అగ్ర నేతల ఆశీస్సులతో, ప్రజా మద్దతుతో ముత్యాల వెంకటేశ్వరరావు తన రాజకీయ ప్రస్థానాన్ని మరింత వేగవంతం చేస్తున్నారు.కేంద్ర పెద్దలతో సత్సంబంధాలు కలిగి ఉంటూ, నియోజకవర్గ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్తున్న ఎం వి ఆర్ తీరుపై స్థానిక కార్యకర్తలు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాంబిల్లిలో పారిశ్రామిక విప్లవం

### :: రెన్యూ సోలార్ తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు







**(రాంబిల్లి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త)**

రాంబిల్లి మండలం జిరాయితీ చింతువా పంచాయతీలో ప్రత్యేక ఆర్థిక మండలి లో రెండో విడతగా సేకరించిన భూముల్లో 135 ఎకరాల భూమిని రెన్యు సోలార్ పరిశ్రమకు కేటాయించారు, ఈ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, ముందుగా పరిశ్రమ ప్రతినిధులు సుమంత్ సిన్హా(సీఈవో), వైశాలి నిగం సిన్హా(సహ స్థాపకురాలు)కు కృతజ్ఞతలు తెలిపారు, అనంతరం నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు ధన్యవాదములు తెలిపారు, ఈ పరిశ్రమ 4200 కోట్ల పెట్టుబడితో 6.5 గిగావాట్స్‌ల సోలార్ ఇంగాట్ వేఫర్ తయారీ ప్లాంట్ ద్వారా 2100 మందికి ఉపాధి లభిస్తుందన్నారు, నరేంద్ర మోడీ లక్ష్యమైన ఆత్మ నిర్భార్ భారత్ కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమైన స్వర్ణాంధ్ర కు మద్దతుగా ఈ ప్లాంట్ ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు, ఈ పరిశ్రమ రెండేళ్లలో పూర్తి అవుతుందని యాజమాన్యం తెలిపిందన్నారు, ముఖ్యంగా స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యత ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు, ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేస్తుందని సోలార్ ప్యానల్స్ మాడ్యూల్స్ తయారీలో ఈ పరిశ్రమ దేశంలోనే కీలక పాత్ర పోషించనుందని తెలిపారు, గత ఐదు ఏళ్లలో గాడి తప్పిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మళ్ళీ గాడిలో పెట్టడమే మా లక్ష్యమన్నారు, అనకాపల్లి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి చేయడం వల్ల విశాఖపట్నం చుట్టుపక్కల ప్రాంతాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని అన్నారు, దేశ విదేశీ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని వారికి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని భరోసా ఇచ్చారు,కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, జిల్లా ఎంపీ సీఎం రమేష్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, బండారు సత్యనారాయణ, ఐజి గోపీనాథ్ జట్టి, కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, అన్ని రంగాల ప్రభుత్వ అధికారులు, నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఉషోదయ కాన్సెప్ట్ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**అనకాపల్లి, ఏప్రిల్ 23;(ప్రభాతవార్త)**





ఉషోదయ విద్యా సంస్థల్లో భాగమైన చోడవరంఉషోదయ కాన్సెప్ట్ స్కూల్లో విద్యార్థుల విద్యా ప్రయాణంలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచే గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా గురువారం నిర్వహించారు. చిన్నారులు గ్రాడ్యుయేషన్ గౌన్లు ధరించి, ఆత్మవిశ్వాసంతో వేదికపై నడుస్తూ తల్లిదండ్రులు, అతిథులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, చైర్మన్ జె .రమణాజీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. చైర్మన్ జె .రమణాజీ మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు తన ఆశీస్సులు అందించారు. ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డిన్ ఎస్.వి. వాసు పాల్గొని గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు ( గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ) ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, వారి అందమైన వస్త్రధారణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుక విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య, తల్లిదండ్రుల హర్షధ్వానాలతో అత్యంత ఉత్సాహభరితంగా ముగిశాయి.

## మూడు లారీలు సీజ్ .!

**(నక్కపల్లి రూరల్, (ప్రభాతవార్త)**



అధికలోడుతో మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా ఫీజులను తప్పించుకునేందుకు అక్రమ రహదారుల్లో పయనిస్తున్న రెండు లారీలను నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు బుధవారం రాత్రి ఈ మూడు లారీలు వేంపాడు నుంచి స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న రహదారిలో వెళుతుండగా పట్టుకోవడం జరిగిందని సీఐ మురళి తెలిపారు. పట్టుకున్న లారీలను సీజ్ చేసి తగు చర్య నిమిత్తం ఆర్టీవో కి పంపించడం జరిగిందని పరిశీలించిన ఆర్టీవో మూడు వాహనాలకు 2,30,000 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఈ రహదారుల్లో అధిక లోడు కలిగి ఎటువంటి వాహనాలు తిరిగిన వారి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ మురళి హెచ్చరించారు.

## మామిడివాడలో శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న ప్రగడ నాగేశ్వరరావు

**(రాంబిల్లి ఏప్రిల్ 22 (ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామంలో వెలసిన శ్రీ పైడితల్లి అమ్మవారిని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎలమంచిలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆయనకు ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిషేకాలు, అర్చనలు నిర్వహించి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు అభివృద్ధి కోసం ప్రార్థించానని అన్నారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వాగతం పలికిన బుద్ధ నాగ జగదీశ్వరావు

**అనకాపల్లి రూరల్**

**ఏప్రిల్ 23 (ప్రభాతవార్త)**



ఎలమంచిలి నియోజకవ్వర్గ రాంబిల్లి మండలం గజ్జి రెడ్డి పాలెంలో సోలార్ పరిశ్రమ శంకుస్థాపనకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.

## చంద్రబాబు నాయుడు కార్యక్రమానికి తరలి వెళ్లిన కూటమి నాయకులు..

**ఎలమంచిలి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త):**



నియోజకవర్గం రాంబిల్లిలో రెన్యూ సోలార్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపన కార్యక్రమానికి వస్తున్న ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు కార్యక్రమంలో పాల్గొనేందుకు మున్సిపాలిటీ పరిధిలోని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్ పిఎసిఎస్ చైర్మన్ మోటూరి గోపీనాథ్ ఆధ్వర్యంలో ఎర్రవరం వార్డు నుండి భారీగా కూటమి కార్యకర్తలతో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి యూనిట్ ఇన్చార్జ్ సేనాపతి రాజా మహేష్, జనసేన నాయకులు ప్రగడ మహేష్, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూడిమడక మత్స్యకారుల ఆందోళనకు తాత్కాలిక విరామం

**(అచ్యుతాపురం ఏప్రిల్ 23 ప్రభాతవార్త )**



అచ్చుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన మత్స్యకారులు తమ ప్రధాన సమస్యలకు పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జీవనోపాధికి కీలకమైన మత్స్య వనరుల పరిరక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, తీర ప్రాంత సమస్యల పరిష్కారం వంటి పలు అంశాలపై ప్రభుత్వ దృష్టి ఆకర్షించాలనే ఉద్దేశంతో వారు ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే, పరిస్థితులను సమీక్షించిన అచ్చుతాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖరావు ర్యాలీని నిలిపివేశారు. అనంతరం ఆయన స్వయంగా ఆందోళనకారులతో సమావేశమై వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, చేపల వేటకు సంబంధించిన పరిమితులు, జీవన భద్రత, ప్రభుత్వం నుంచి రావలసిన సహాయంపై వారు వివరంగా వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మత్స్యకారుల సమస్యలను సమగ్రంగా సేకరించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం రూపంలో పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. పోలీసుల సూచనలు, హామీలను గౌరవించిన పూడిమడక మత్స్యకార నాయకులు తమ ర్యాలీని స్వచ్ఛందంగా విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో చోడిపల్లి అప్పారావు, వాసుపల్లి శ్రీనివాసరావు, ఉమ్మిడి జగన్, ఉమ్మిడి అప్పారావు, మేరుగు చినరాజులు, చేపల శ్రీరాములు, మేరుగు అప్పలరాజు, ఏరిపిల్లి ముత్యాలు, ఏరిపిల్లి భాను తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై మత్స్యకారులకు మద్దతు తెలిపారు. మత్స్యకారుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఏప్రిల్ 24 నుంచి స్కూల్స్‌కు బ్రేక్.. జూన్ 12న పునఃప్రారంభం

**(అచ్చుతాపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త)**



అచ్చుతాపురం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించినట్లు మండల విద్యాశాఖ అధికారి దేవరాయల్ గురువారం తెలిపారు. విద్యార్థులకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి విరామం ఉండనుందని, జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని వెల్లడించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం కాపాడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. సెలవుల సమయంలో పిల్లలు ఎండ తీవ్రతకు గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవడం, తగినంత నీరు, శీతల పానీయాలు తీసుకునేలా చూడడం అవసరమన్నారు. ఇక విద్యార్థులు సెలవులను వినోదంతో పాటు ఉపయోగకరంగా గడపాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పాఠ్యాంశాలపై పునర్విమర్శ చేయడం, పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం, నూతన నైపుణ్యాలు అభ్యసించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించే కార్యకలాపాలకు ప్రోత్సహించడంతో పాటు, వారి భవిష్యత్తు విద్యాభివృద్ధికి దోహదపడే విధంగా మార్గనిర్దేశం చేయాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేసవి - జాగ్రత్తల సమయం, అభ్యాసానికి అవకాశం!

## భగవద్గీతతో వ్యక్తిత్వ వికాసం పెంపు

**అనకాపల్లి ఏప్రిల్ 23 :(ప్రభాతవార్త)**



వ్యక్తిత్వ వికాసం పెంపొందించడానికి భగవద్గీతలోని సుమారు 40 శ్లోకాలతో రూపొందించిన భవద్గీత పారాయణం చదవాలని అనకాపల్లి విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు ప్రముఖ వైద్యులు డిడి నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ నందు వాకర్స్ అందరికీ అనకాపల్లి జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో 40 శ్లోకాలతో రూపొందించిన భగవద్గీత పారాయణం గ్రంథాలను గురువారం వాకర్స్ సభ్యులకు అందజేశారు. డాక్టర్ డి డి నాయుడు మాట్లాడుతూ మానవుని మాధవునిగా మార్చే దివ్య గ్రంథం భవద్గీత అన్నారు. గీత నేర్చుకుందాం రాత మార్చుకుందాం. కృష్ణ పరమాత్మ చెప్పిన దైవ గ్రంథం. మనసుని అదుపులో ఉంచుకొని ఉన్నత జీవనాన్ని తెలియజేసే గ్రంథం. ఎవరైతే గీతా పారాయణం చేస్తారో వారు ఇహం లో బ్రహ్మజ్ఞానాన్ని అంత్యంలో మోక్షాన్ని పొందుతారు. ఈ సందర్భంగా 100 మందికి భవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి పీలా హేమ జగదీష్ నాయుడు, జిల్లా ప్రముఖులు జీఎన్ వివిఎస్ మూర్తి, ఆడారి హరి ప్రభాకర్, వాకర్స్ క్లబ్ అనకాపల్లి సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజరర్ విల్లూరి కోటి మహాలక్ష్మి నాయుడు , ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ , కొణతాల రమణప్పా , ప్రెసిడెంట్ జగ్గారావు ,దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో కంట్రోల్ ఏర్పాటు

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో రాంబిల్లిలో జరిగే కార్యక్రమానికి మండలం నుంచి పాల్గొనే వారికి సంబంధించి ఏర్పాట్లు విషయమై ముందుగా ఎంపీడీవో కే. చలపతిరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల వారిగా సమాచారం సేకరించి వారి ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లు చేశారు. పూర్తిస్థాయి వివరాలు సేకరించిన మేరకు వారు సభ నుంచి క్షేమంగా వారి వారి గ్రామాలకు చేరుకునేంతవరకు ప్రత్యేకమైన కంట్రోల్ రూమ్ను మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ లో ఏవో దెందుకూరి సీతారామరాజు తో పాటు ఏపీఎం శ్రీనివాసరావు ,సీనియర్ అసిస్టెంట్ రాజు,ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తూ సభకు వెళ్లే వారికి అందుబాటులో ఉన్నారు.

vsp11:vsp11.qxd 23-04-2026 22:37 Page 1






## ఏడు కేంద్రాల్లో పాలిటెక్నిక్ పరీక్షలు : పాలిసెట్ కో ఆర్డినేటర్

పాడేరు,ఏప్రిల్23, ప్రభాతవార్త: ఈ నెల 25న జరగనున్న పాలిసెట్2026 పరీక్షకు అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా రెండు పట్టణాలలో 7 కేంద్రాలను సిద్ధం చేసినట్లు పాడేరు జి. ఎం. ఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్ ఎం. హరి బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఈ పరీక్షల్లో 1680 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. పాడేరులో 6 కేంద్రాలలో 1406 మందిలో 1. గవర్నమెంట్ డిగ్రీకాలేజి లో 249, మంది 2. గవర్నమెంట్ జూనియర్ కాలేజి లో 240 మంది 3. గవర్నమెంట్ ఆశ్రమ పాఠశాలా తలరిసింగ్ లో 225 మంది 4ఎపి టి డబ్ల్యు ఆర్ స్కూల్ కుమ్మరిపుట్టులో 224 మంది 5. ఎపిటిడబ్ల్యు ఆర్ జూనియర్ కాలేజి కుమ్మరిపుట్టు లో 240 మంది 6. గవర్నమెంట్ ఆశ్రమ పాఠశాలా (గర్ల్స్) శ్రీ కృష్ణపురం లో 228 మంది అలాగే చింతపల్లిలో జిల్లాపరిషత్ పాఠశాలలో 274 మంది విద్యార్థులు పరీక్షా రాయనున్నట్లు తెలిపారు, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షా జరుగుతుందని పరీక్షా రాసే విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని 11 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యం అయిన అనుమతించారని తెలిపారు పరీక్షా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ కాకపోయినా ఇతర సమస్యలు ఉన్నా 9490491157, 9441717038 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## స్వీయగణన అవగాహన కార్యక్రమం విజయవంతం




పాడేరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీయ గణనపై అవగాహన, ప్రచార కార్యక్రమం పాడేరు ప్రభుత్వడిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టబ్బాయి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి అత్యంత ముఖ్యమైన ప్రక్రియ అని, ప్రతి పౌరుడు స్వీయగణనలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సరైన సమాచారాన్ని నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి వీలవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బోటనీ విభాగాధిపతి, 2026 జనగణన అల్లూరి జిల్లా మాస్టర్ ట్రైనర్‌గా ఉన్న డాక్టర్ పి.జానకి రావు స్వీయ గణన విధానంపై సవివరంగా అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసే విధానం, అవసరమైన పత్రాలు, నమోదు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలను వివరించారు. అలాగే ప్రతి కుటుంబం ఈ ప్రక్రియలో పాల్గొనడం ద్వారా కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్న వారందరూ స్వయం లెక్కింపు ప్రక్రియపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలని నిర్ణయిం చుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో జనగణనపై చైతన్యం పెరగడంతో పాటు స్వయం లెక్కింపు ప్రక్రియ విజయవంతం కావడానికి దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## హైడ్రో పవర్ ప్రాజెక్టు గ్రామాల్లో శాటిలైట్ సర్వే ఎందుకు..?



పాడేరు,ఏప్రిల్ 23, ప్రభాతవార్త: ఆదివాసీ గ్రామ సభ ఆమోదం లేకుండా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో ఇటువంటి పనులు చెప్పట్టవద్దని ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ అధ్వర్యంలో అల్లూరి జిల్లా జిల్లా కలక్టర్ టీ. నిశాంతి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ నాయకులు పి.అప్పలనరస మాట్లాడుతూ హుకుంపేట మండలం, బూర్జా పంచాయితీ, చిట్టంవలస పరిధిల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే ఆఫ్ ఇండియా, సైన్స్ టెక్నాలజీ శాఖ అధికారులైన ఆనంద్ సాహూ, వరద బోయిన గోపాలరావు రహస్య సర్వే చేస్తున్న బృందాన్ని అడ్డుకొని స్థానిక ఆదివాసీలు అడ్డుకున్నారు. వారిని స్థానిక మండల తహశీల్దార్ మరియు పోలీసుశాఖ వారికి అప్పగించారు. రహస్యంగా సర్వే నిర్వహించడం వల్ల ఆదివాసీ గ్రామాల ప్రజలు తీవ్రమైన భయబ్రాంతులకు గురైవున్నారన్నారు. అంతేకాకుండా గతంలో జిల్లా కలెక్టర్ గారు గ్రామసభ ఆమోదం లేకుండాఎటువంటి హైడ్రో పవర్ ప్రాజెక్టు సంబంధించి పనులు ప్రారంభించాబోమని ప్రజల సమక్షంలో ఇచ్చిన హామీని అధికారులు ఉల్లంఘించారు. షెడ్యూల్ జిల్లాలో 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం, ఆదివాసీల గ్రామసభ అనుమతి లేకుండా ఆదివాసీ హక్కులు, చట్టాలు ఉల్లంఘించి అనంతగిరి, అరకువేలి, హుకుంపేట, చింతపల్లి కొయ్యూరు, జీకేవీధి మండలాల్లో చిట్టంచలన గుజ్జెలి పెద్దకోట ఎర్రవరం, సీలేరు 8200 మెగా వాట్లు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి జి.ఓ.ఎంఎస్ నెంబర్ 13 జీవో ఎంఎస్ నెంబర్ 51, జీవోఎంఎస్ నెంబర్ 2 రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా గిరిజన హక్కులు, చట్టాలను ధిక్కరించి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.. అల్లూరి జిల్లా, పాడేరు డివిజన్ పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీ లైన నవయుగ, ఎలక్ట్రిసిటీ (ప్రైవేట్ లిమిటెడ్, అదాని హైడ్రో ఎలక్ట్రిసిటీ ప్రైవేట్ లిమిటెడ్, శిరిడి సాయి ఎలక్ట్రిసిటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు అదివాసి హక్కులు చట్టాలు ఉల్లంఘించి ఆదివాసి గ్రామసభ అనుమతి లేకుండా ఏకపక్షంగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు జీవోలు జారీ చేసింది. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల అనంతగిరి, అరకువేలి హుకుంపేట, చింతపల్లి, కొయ్యూరు, జికె వీధి మండలాల్లో 250 గ్రామాలు, 60 వేల మంది ఆదివాసులు జల సమాధి అవుతారని, 20 వేల ఎకరాల జిరాయితీ భూమి వేల ఎకరాల అటవీ భూమి, కాఫీ,మిర్యాల తోటలు జీవనాధారం సర్వం కోల్పోయి నిరాశ్రయులవుతారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందం జారీ చేసిన జీవోలను తక్షణమే రద్దు చేయాలని, హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వే ఆఫ్ ఇండియా, సైన్స్‌టెక్నాలజీ ఆధ్వర్యంలో చేస్తున్న రహస్య సర్వేలను తక్షణమే నిలుపుదల చేయాలి. సర్వేకు వచ్చిన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. సాటిలైట్ సర్వే పేరుతో అధికారులు రహస్య సర్వే నిర్వహించడం సరికాదన్నారు. జిల్లా పరిధిలో సుమారు 4000 గిరిజన గ్రామాలు ఉంటే కేవలం హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మిస్తున్న ప్రాంతంలోని వెళ్లి సాటిలైట్ సర్వే చేయడం ఏంటని జిల్లా కలెక్టర్ ని ప్రశ్నించారు. గతంలో జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు గ్రామసభ ఆమోదం లేకుండా హైడ్రో ప్రభావిత ప్రాంతంలో ఎవరు వచ్చినా ప్రతిఘటన తప్పదని తెలిపారు. అధికారుల శాంతి వద్ద పరిపాలనకు పోరాట కమిటీ సహకరిస్తుందని స్థానిక అధికారులతో ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు చేసుకొని గ్రామాలకు కొత్తవారు రావాలని జిల్లా కలెక్టర్‌కి తెలిపారు. అల్లూరి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం తనకు తెలియదని పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాత ప్రభుత్వం నిర్ణయం మేరకు గ్రామసభను సంప్రదిస్తామని పేర్కొన్నారు. సాటిలైట్ సర్వేకు వచ్చిన వారిని అడ్డుకోవడం సరి అయింది కాదని అన్నారు. కార్యక్రమంలో బూర్జ ఎంపీటీసీ హరి పోరాట కమిటీ నాయకులు సివేరి కొండలరావు, దశరథ్,సురేషు , కృష్ణంరాజు, గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్. చిట్టిబాబు, కార్తీక్ ,పీసా కమిటీ సభ్యులు తాజామాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి



పాడేరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: భగీరథ మహర్షి జయంతి వేడుకలు సందర్భంగా,అయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ నిర్వహించిన భగీరథ మహర్షి జయంతి వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టుదలకు, క్రమశిక్షణకు భగీరథుడు నిలువుటద్దమని కొనియాడారు. అసాధ్యమైన పనిని సుసాధ్యం చేసి, గంగను ధరణికి తెచ్చిన ఆయన స్ఫూర్తి నేటి తరానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సగరుల సంక్షేమం కోసం ఆయన చేసిన తపస్సు ఆదర్శనీయమని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అందరూ అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్ (ఫ్ఏసి) ఆదిత్య వర్మ, డిఆర్ఓ (ఫ్ఏసి) ఏం వి ఎస్ లోకేశ్వరరావు, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ బి. నీలకంఠరావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి మీ వి.గోపీనాథరావు, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సంరక్షణే లక్ష్యంగా జలధార .. జలహారతి : కలెక్టర్



పాడేరు,ఏప్రిల్23 ప్రభాతవార్త: జిల్లాలో భూగర్భ జల మట్టాలను పెంచడమే ధ్యేయంగా చేపట్టిన జలధరజల హారతి 100 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ టి.నిశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఇందుకు సంబంధించిన వివిధ శాఖల సమన్వయంతో నీటి నిల్వ కట్టడాల నిర్మాణానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆమె సూచించారు. గ్రామాల గుర్తింపు, జిల్లాలోని 11 మండలాల్లో ఇప్పటివరకు 326 గ్రామాలలో భూగర్భజలాల సంరక్షణ కట్టడాల కోసం స్థలాలను గుర్తించడం జరిగిందని, ఎందుకు సంబంధిత శాఖల సమన్వయంతో మిగిలిన గ్రామాల్లో కూడా అనువైన ప్రదేశాల ను గుర్తించేందుకు గ్రౌండ్ వాటర్ డి.డి, డ్వామా పి.డి, ఎస్.ఎమ్.ఐ ఈ.ఈ, ఫారెస్ట్ డి.ఎఫ్.ఓ, ఆర్. డబ్ల్యు.ఎస్.ఎస్.ఈలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికతో పాటు, గుర్తించిన గ్రామాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఇతర నీటి సంరక్షణ కట్టడాల డిజైన్లను త్వరితగతిన రూపొం దించాలని స్పష్టంచేశారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి ఎద్దడి కలగకుండా ఉండాలంటే, ఈ వంద రోజుల ప్రణాళికలో నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, పాడేరు సబ్ కలెక్టర్ (ఎఫ్ఏసి)వీడి డ్రామా కె.విద్యాసాగర్, డిడి భూగర్భ జల వనరుల శాఖ అధికారి శ్రీనివాస రావు, అటవీశాఖ డీఎఫ్ఓ, వ్యవసాయ శాఖ ఎస్‌బిఎస్ నందు, ఎస్ఈ విద్యుత్ శాఖ, ఉద్యానవన శాఖ అధికారి కె.బాలకృష్ణ, జిల్లా మేనేజర్ పరిశ్రమలశాఖ ఆర్‌వి రామారావు, సమంత సాకలి పాల్గొన్నారు.

## కాఫీ కూలీలకు వారానికే వేతనాలు చెల్లించాలి : ఏఐటీయూసీ



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త) : ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏ.పీ. ఎఫ్.డి.సి) పరిధిలోని కాఫీ తోటల్లో పనిచేస్తున్న కూలీలకు ప్రతి వారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అమర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్.వి.నగర్‌లోని ఏపీఎఫ్డీసీ డివిజనల్ మేనేజర్ (డీఎం) కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ కాఫీ తోటల్లో రోజువారీ కూలీ పనులు చేసుకునే కార్మికులకు నెలకు ఒకసారి బ్యాంకు అకౌంట్లలో నగదు జమ చేస్తామన్న యాజమాన్య నిర్ణయం సరైంది కాదన్నారు. గతంలో వారంలో ఇవ్వాల్సిన పేమెంట్లే రెండు మూడు వారాల ఆలస్యమయ్యేవని, ఇప్పుడు కొత్తగా నెలకోసారి అంటే కార్మికులు ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. రెక్కాడితే గానీ డొక్కాడని కూలీల పరిస్థితిని అర్థం చేసుకుని, పాత పద్ధతిలోనే వారానికి ఒకసారి వేతనాలు చెల్లించాలని కోరారు. లేని పక్షంలో అన్ని ఎస్టేట్ల నుంచి కాఫీ కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఏ.పీ.ఎఫ్.డీ.సి యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు, ఉపాధ్యక్షులు పాంగి శివకుమార్, కాఫీ యూనియన్ ఉపాధ్యక్షులు వంతల టి.ఎస్. బాబు, బట్టి రాంబాబు, నాగరాజు, భాను, శైలజ, జోష్ణ పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



పాడేరు, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త) : ఇరడపల్లి పంచాయతీ బొడ్డపుట్టులో బుదవారం భారీ వర్షంతో పాటు ఈదురగాలులు, పిడుగుపాటుకి ఆరు విద్యుత్ స్తంబాలు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తాజా మాజీ సర్పంచల్లెలి అశ్విజ, వైస్సార్సీపీ యువజన విభాగం పాడేరు మండల అధ్యక్షుడు గల్లెలి లింగమూర్తి పేర్కొన్నారు. ఈ సమాచారం ట్రాన్స్ కో ఎడి, ఎఈ ఇవ్వడంతో యుద్ధప్రాతిపదికన నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈసందర్భంగా సర్పంచ్, గ్రామస్తులు ట్రాన్స్ కో అధికారులకు, లైన్‌మెన్‌లకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

## అనంతబాబును అరెస్టు చేయాలని డిమాండ్



అరకు రూరల్ , ఏప్రిల్ 23, ప్రభాతవార్త: దళిత యువకుడిని హత్య చేసి సాక్ష్యాలను తారుమారు చేయాలని ప్రయత్నం చేస్తున్న హంతకుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ భాస్కర్ (అనంతబాబు) ని వెంటనే అరెస్టు చేయాలని అరకులోయలో ఆదివాసీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు సియ్యారి అజయ్ దొర ఆధ్వర్యంలో అరకులోయ లోని వైయస్సార్ విగ్రహం ఎదురుగా నిరసన తెలిపారు. దీనికి ముందు అంబేద్కర్ కూడలి నుంచి వైయస్సార్సీపి కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నేరుగా దళిత యువకుడ్ని హత్య చేసి డోర్ డెలివరీ చేయడమే కాకుండా ఇప్పుడు ఆ కేసు నుండి తప్పించుకోవడానికి సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్న అనంత బాబు బయట ఉండడానికి వీలు లేదని పేర్కొన్నారు. హంతకుడు బయట ఉంటే మరింత మంది దళితుల ప్రాణాలను తీసే ప్రమాదం ఉందని ఆ గొడ్డలి పార్టీ నేతను అరెస్టు చేయాలంటూ నినదించారు. తానే నేరుగా హత్య చేశానని ఒప్పుకున్నా గత ప్రభుత్వంలో ఆయన మహారాజుల బయట తిరిగారని ఇప్పుడు మాత్రం క్షమించవద్దని వారంతా పేర్కొన్నారు. దళితులన్నా... ఆదివాసీలన్నా ఆయనకి చిన్న చూపని అందుకే వారిని నేరుగా హత్య చేసి ఆ కేసు నుంచి తప్పించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ ఏఎంసి ఛైర్మన్ బోరి బోరి లక్ష్మి, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనంద్, అరకు లోయ నియోజకవర్గం ఎస్టి సెల్ అధ్యక్షులు బురిడీ కొములు నాయుడు, ప్రధాన కార్యదర్శి పాంగి రాజు, సీనియర్ టీడీపీ నాయకులు పాడి చందు, మాడగడ పంచాయతీ అధ్యక్షులు కొర్ర సుబ్బారావు, మాదల టీడీపీ సీనియర్ నాయకులు సివేరి అప్పలనాయుడు, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు స్వభి రామచందర్, బీజేపీ పార్లమెంట్ నాయకులు బిమిడి దొంబు నాయుడు, అరకు లోయ క్లస్టర్స్ కొర్ర శేఖర్ కిల్లో మోహన్ దాస్, డుంబ్రిగుడ క్లస్టర్ ఇంచార్జి కొర్ర నాగరాజు, పెదలబుడు ఉపాధ్యక్షులు పూజారి లక్ష్మినారాయణ, డుంబ్రిగుడ టిఎన్‌టియుసి అధ్యక్షులు కిల్లో సిద్దేశ్వరావు, మాజీ ఎంపీటీసీ కిల్లో కుమార్, సిరాగం పంచాయతీ అధ్యక్షులు పూజారి మాణిక్యం కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మలేరియా వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త) : ప్రతీ ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపడితే మలేరియా వ్యాధిని నివారించవచ్చని మలేరియా చింతపల్లి సబ్ యూనిట్ అధికారి పోతురాజు అన్నారు. ఆర్ వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా. రోషి తో కలసి మండలంలోని నీలవరం, ఎర్రవరం గ్రామాల్లో మొదటి విడత మలేరియా ముందు పిచికారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని తెలిపారు. నీరు నిల్వ ఉన్నచోట దోమలు వృద్ధి చెంది అవి కాటు వేయడం ద్వారా మలేరియా వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వీటిపై గిరిజనుల్లో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రస్తుతం వాతావరణం మార్పుల కారణంగా వ్యాధుల ప్రభలే అవకాశం ఉందని పేర్కొన్నారు. జ్వరం వస్తే కచ్చితంగా సమీప ఆసుపత్రికి వెళ్లి మలేరియా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ సూపర్వైజర్ శ్రావణి, ఎంపీహెచ్ఈఓ జాన్సన్, ఆరోగ్య సహాయకుడు సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన డీఆర్వో



పాడేరు,ఏప్రిల్23, ప్రభాతవార్త: నెలవారి తినిఖీలో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాల రూమ్స్‌లో భద్రపరిచి ఉన్న ఈవీఎం లను వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరిండెంటెంట్, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్‌తో కలిసి ఈవీఎం స్ట్రాంగ్ గోదామును జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ ఏ సి) ఎం.వి ఎస్ లోకేశ్వరరావు. పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీలను, పరిసర ప్రాంతాలను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపిస్తూ భద్రపరిచి ఉన్న ఈవీఎంలకు సంబంధించి అధికారులకు, భద్రతా సిబ్బందికి సూచనలు చేస్తూ, ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ తనిఖీ లో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. కార్యక్రమంలో బిజెపి ప్రతినిధి బి నందు , వైఎస్ఆర్ సిపి ప్రతినిధి టీ మాణిక్యం, ఇతర ప్రజా ప్రతినిధి, పాడేరు మండల్ డిప్యూటీ తాసిల్దార్, ఎలక్షన్ తహసిల్దార్, ఇతర రెవెన్యూఅధికారులు, ఎలక్షన్ సూపరిండెండెంట్ లక్ష్మణరావు, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో పర్యాటక, పారిశ్రామిక ప్రాజెక్టులు వేగవంతం చేయాలి

### ముందస్తు సమీక్ష సమావేశంలో జేసీ శ్రీపూజ



పాడేరు,ఏప్రిల్23, ప్రభాతవార్త: విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధి అభివృద్ధిలో భాగంగా జిల్లాలో శాఖల వారీగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లను భవిష్యత్తులో నిర్మాణం చేపట్టబోయే ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతిపై జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ సంబంధిత శాఖల అధికారులతో ముందస్తు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, ఎదురవుతున్న అడ్డంకులు, భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఎకనామిక్ రీజియన్ పరిధిలోని మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక కారిడార్లు మరియు కనెక్టివిటీ ప్రాజెక్టుల పనులను జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో సమీక్షించారు. నిర్ణీత కాలం పరిమితిలోగా అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. వివిధశాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని, అనుమతుల ప్రక్రియలో జాప్యాన్ని నివారించాలని సూచించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా స్థానిక యువతకు లభించే ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆమె పేర్కొన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి జిల్లా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, పనుల వేగాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్. వి రమణారావు, పాడేరు ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వర్లు, జిల్లా పర్యాటక శాఖ అధికారి దాసు, ఇంచార్జ్ జిల్లా అటవీశాఖ అధికారిణి ఉమామహేశ్వరి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పీబీఎల్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ చేయూత



పాడేరు,ఏప్రిల్ 23, ప్రభాతవార్త: అల్లూరి జిల్లా పాడేరు పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో చదువు కునే విద్యార్థుల సౌకర్యార్థం పీబిఎల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ వారు తమ (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధుల నుండి విరాళంగా అందించిన పలు వస్తువులను జిల్లా కలెక్టర్ నిషాంత్.టి వారు ఈరోజు ప్రారంభించారు. గురువారం జిల్లా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా పీ బి ఎల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ వారు వస్తువులను సామాగ్రిని ఉచితంగా అందజేశారన్నారు. లైబ్రరీలో వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు కూర్చొని బుక్స్ చదువుకునేందుకు విలుగా 40 కుర్చీలు, గ్రంథాలయంలో కాంపిటేటివ్ బుక్స్, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం విలువైన పుస్తకాలు, ఒక కంప్యూటర్, డిజిటల్ లెర్నింగ్ మరియు ఆన్‌లైన్ సమాచారం కోసం, 2 బుక్ ర్యాక్స్‌లను పుస్తకాలను క్రమపద్ధతిలో అమర్చుకోవడానికిగాను అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాభివృద్ధికి ముందుకు వచ్చిన పిబిఎల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు ముఖ్యంగా పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే గిరిజన ప్రాంత విద్యార్థులకు ఈ పుస్తకాలు, కంప్యూటర్ ఎంతో ఉపయోగపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిబిఎల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేష్ , శి4 యంగ్ ప్రొఫెషనల్ శ్రీనివాస్ , స్థానిక డిప్యూటీ ఎంపీడీవో , శాఖ గ్రంథాలయ అధికారి వి. మానస , వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నల్లబెల్లి జలపాతం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు




గూడెం కొత్తవీధి ,ఏప్రిల్ 23 (ప్రభాతవార్త): దామనపల్లి పంచాయతీ పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో ఉన్న జలపాతం వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. స్థానిక పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆర్‌వీఎస్ లక్ష్మి, పంచాయతీ సిబ్బందితో కలిసి జలపాతం వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులు, యువకులు జలపాతాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు నిర్లక్ష్యంగా జలపాతం వద్దకు చేరకుండా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండి వారిని నిలువరించాలని కోరారు. ఇటీవల చెరువులు, కాలువల్లో పడి మరణాల సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ బేరా సింహాచలం, సీఆర్‌పీ పాంగి బాలరాజు, క్లాప్ మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## బొంతువలస ఘాటీ ప్రమాదాలపై సమగ్ర సమీక్ష అవసరం



గూడెం కొత్తవీధి ,ఏప్రిల్ 23 (ప్రభాతవార్త): అల్లూరి జిల్లాలో హైవే మార్గాల్లో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, వాటివల్ల సంభవిస్తున్న మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని గిరిజన జాగృతి సమన్వయ సమితి అధ్యక్షుడు ముర్ల వెంకటరమణ పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు ప్రాణాలు కోల్పోవడం మరింత బాధాకరమని ఆయన అన్నారు. జీకేవీధి–కొయ్యూరు మండలాల సరిహద్దులో ఉన్న బొంతువలస ఘాటీ రహదారి నిత్యం ప్రమాదాలకు కారణమవుతుండడం ఆందోళనకరమని తెలిపారు. ఈ రహదారి నిర్మాణం సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా జరగలేదనే అభిప్రాయం స్థానికుల్లో బలంగా వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంలో పర్యవేక్షణ లోపాలు, ఇంజినీరింగ్ ప్రమాణాల నిర్లక్ష్యం, కొందరు గుత్తేదారుల లాభాపేక్ష వంటి అంశాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయా అనే అనుమానాలు ఉన్నాయని అన్నారు. పనులు మంజూరు అయిన తర్వాత తగిన సాంకేతిక పర్యవేక్షణ లేకుండానే నిర్మాణం కొనసాగుతోందని, కొన్నిచోట్ల యంత్రాల ద్వారా యథేచ్ఛగా పనులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారని వివరించారు.ఏ అభివృద్ధి పనులైనా స్థానిక ప్రజలు, నాయకులతో సమన్వయం అవసరమని, ప్రాంతీయ పరిస్థితులు, భౌగోళిక స్వభావం, ప్రమాద సూచనలపై స్థానికులకు ఉన్న అవగాహనను పరిగణనలోకి తీసుకుంటే మరింత సురక్షితమైన రహదారులు నిర్మించవచ్చని తెలిపారు.ప్రస్తుతం బొంతువలస ఘాటీ రహదారిలో పదుల సంఖ్యలో ప్రాణనష్టాలు చోటుచేసుకుంటున్నాయని, ఈ పరిస్థితులకు బాధ్యత ఎవరిది అనే అంశంపై స్పష్టత అవసరమని అన్నారు. పాలకులు, ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులు కలిసి సమగ్ర సమీక్ష జరపాలని కోరారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని, ప్రమాదాలకు కారణమవుతున్న లోపాలను సరిదిద్దాలని, అవసరమైతే రహదారి నిర్మాణాన్ని పునఃసమీక్షించాలని వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణభద్రత దృష్ట్యా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, లేకపోతే ఈ మార్గంపై ప్రయాణాలు మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని హెచ్చరించారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి బొంతువలస ఘాటీ రహదారిపై సమగ్ర పరిశీలన చేసి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ఇల్లు కోల్పోయిన బాధితుడ్ని ఆదుకోవాలి



గూడెం కొత్తవీధి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త) సంకాడ గ్రామపంచాయతీ పరిధిలోని నిమ్మలపాలెంలో ఈరోజు కురిసిన భారీ వర్షాలు మరియు బలమైన గాలుల కారణంగా మొండి రామకృష్ణ ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా ఎగిరిపోయాయి. ఈ ప్రమాదం వల్ల ఆ కుటుంబం నిలువనీడ కోల్పోయి, ప్రస్తుతం నివాసానికి వీలులేని అత్యంత దయనీయ స్థితిలో ఉంది. కావున, సంబంధిత ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి, ఘటనా స్థలాన్ని పరిశీలించాలని పంచాయతీ అధ్యక్షులు ఉలాం ఈశ్వర్ కోరారు. బాధితులకు తక్షణమే తాత్కాలిక నివాస సౌకర్యం, తార్పాలిన్లు, ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను జనసేన పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.



ong-12_ong-12.qxd 4/23/2026 11:44 PM Page 1



## భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 1415 సంవత్సరాల బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్ ఇవ్వడం చాలా మంచిది..

**ఎలమంచిలి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**



మండలంలోని రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 1415 సంవత్సరాల బాలికలకు హెచ్ పివి వ్యాక్సిన్ ఇవ్వడం చాలా మంచి ప్రజా ఆరోగ్య చర్యని దీనివల్ల భవిష్యత్తులో వచ్చే సర్వికల్ క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని వైద్య అధికారులు తెలిపారు. ప్రధానంగా 914 సంవత్సరాలు సాధారణంగా రెండు రోజులు సరిపోతాయని (0,612 నెలల మధ్య), 15 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ సాధారణంగా మూడు రోజులు అవసరమని (0,2,6 నెలల షెడ్యూల్) కాబట్టి 1415 మధ్య ఉన్న వారిలో వారు వయస్సు వైద్యుల సలహా ఆధారంగా డోసు సంఖ్య నిర్ణయిస్తారని అన్నారు. దీనివలన సైడ్ ఎఫెక్ట్స్ (సాధారణంగా స్వల్పం) ఇంజక్షన్ వేసిన చోట నొప్పి లేదా వాపు తలనొప్పి లేదా సెల్ఫ్ జ్వరం ఇవి సాధారణంగా ఒకటి రెండు రోజులు తగ్గిపోతాయని తెలిపారు. ఈ వ్యాక్సిన్ ముఖ్య ప్రయోజనాలు సర్వికల్ క్యాన్సర్ నివారణలో కీలకమని హెచ్ పి వి వల్ల వచ్చే ఇతర ఇన్ఫెక్షన్స్ నుండి రక్షణ పొందుతారని భవిష్యత్తులో ఆరోగ్య ఖర్చులు తగ్గించే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యాక్సిన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా వేస్తున్నారు.

## ముఖ్యమంత్రి సభకు తరలి వెళ్లిన ప్రజలు

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలంలో గురువారం రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో సభలో పాల్గొనేందుకు నక్కపల్లి మండలం నుంచి ప్రత్యేకమైన వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయం వద్ద వెళ్లే వాహనాలకు టిడిపి పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు జెండా ఊపి బస్సులు ముందుకు సాగేటట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే .చలపతిరావు ఏవో దెందుకూరు సీతారామరాజు, ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీఓ భాగ్యలక్ష్మి తో పాటు మండల మహిళా అధ్యక్షురాలు మునిషా బేగం,టిడిపి నాయకులు ఉన్నారు.

## భక్తి తరంగాల్లో ఉద్దపాలెం

### : కొత్తమ్మ తల్లి మహోత్సవం ఘన వైభవం

**(అచ్చుతాపురం ఏప్రిల్ 23 ప్రభాతవార్త)**



అచ్చుతాపురం మండలం చిప్పాడ పంచాయతీ పరిధిలోని ఉద్దపాలెంలో కొత్తమ్మ తల్లి పండగ మహోత్సవం అపూర్వ భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 6 గంటల నుంచే భక్తజనం పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారి సేవలో నిమగ్నమయ్యారు. ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలతో పాటు కుంకుమ పూజలు, చీర సారీల సమర్పణతో మహిళలు భక్తి భావాన్ని వ్యక్తం చేశారు."అమ్మ" అని పిలుస్తూ తల్లి దర్శనం చేసుకోవడం ద్వారా గ్రామస్తులు తమ ఆధ్యాత్మిక అనుబంధాన్ని చాటుకున్నారు. వినూత్నంగా నిర్వహించిన పందరి భజనలు, కోలాటాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తి గీతాల నడుమ గ్రామం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో ముస్తాబైంది. వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కమిటీ సభ్యులు భక్తులకు చల్లని పానీయాలు, మజ్జిగ, పులిహార, చక్ర పొంగలి వంటి ప్రసాదాలను సమృద్ధిగా పంపిణీ చేశారు. సేవాభావంతో నిర్వహించిన ఈ ఏర్పాట్లు భక్తుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, రాజాన రసింగరావు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. భక్తి, సంప్రదాయం, ఐక్యతకు నిదర్శనంగా నిలిచిన ఈ మహోత్సవం గ్రామంలో ఆనందోత్సాహాలను నింపింది.

## 125 రోజులు పని దినాలు సద్వినియోగం చేసుకోవాలి..

### - కొత్త ప్రణాళిక ద్వారా చెరువులు ఆధునికరణ

**గొలుగొండ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ప్రభుత్వం నూతన ప్రవేశపెట్టిన రోజులు పని దినాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ సూర్య మణి అన్నారు. జలకల లో భాగంగా మెరుగైన సాగు విధానం కోసం గొలుసుకట్టు చెరువుల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పప్పుశెట్టిపాలెం పంచాయితీ నాగన్నదొరపాలెం చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ముందుగా శ్రామికుల నమోదును తనిఖీ నిర్వహించి సరిచూశారు అనంతరం వారితో మాట్లాడుతూ మండలంలో 13 చెరువులు ఆధునీకరణకు ప్రణాళిక మంజూరు అయిందని అన్నారు. వీటి ద్వారా చెరువుల అనుసంధానం తో పాటు కాలువలు ఆధునీకరణ మదాలు మరమ్మతులు చేపట్టి సాగుకి సంపూర్ణంగా నీరందేలా తయారు చేయడం జరుగుతుందన్నారు. సాగు కి ఇబ్బంది లేకుండా కాలువలు పూర్తిస్థాయిలో ఆధునికరించి రైతులు అందుబాటులోకి తీసుకొస్తానని అన్నారు. ప్రధానంగా పాలెం చెరువు నుండి నాగన్న దొరపాలెం, దొర చెరువుకు గొలుసుకట్టుగా ఆధునీకరణ జరుగుతుందన్నారు. సాల్మియా నాయక దిగువునున్న అన్ని పంట కాలువలు లైనింగ్ పనులు సుందరీ కరణ జరిగే విధంగా ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు ఈ చెరువుల్లో ముందుగా ఉపాధి హామీ ద్వారా పుడితీత, గట్ల ఆధునీకరణ పొర్లు కట్టు నిర్మాణం వాటి అనుసంధానంగా ఉన్న కాలువలు మెరుగుపరిచే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శ్రామిక సంఘాలన్నీ ఇం ఊ దుకు అనుకూలంగా పని చేయాలని నూతనంగా రూపొందించిన 125 రోజులు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. టెక్నికల్ సిబ్బంది వి ఆర్ పి లు నూకరాజు పాల్గొన్నారు

## కోర్టు ధిక్కరణ కింద జిల్లా కలెక్టర్, అధికారులపై కేసులు నమోదు చేయాలి

**నర్సీపట్నం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



నర్సీపట్నం పెద్ద చెరువులో ఎలాంటి పనులు చేపట్టవద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పనులు చేయిస్తున్న అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ గురువారం జిల్లా ఎస్పీకి నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం పెద్ద చెరువులో 108 అడుగుల శివపార్వతుల విగ్రహం పెట్టేందుకు జరుగుతున్న పనులు వల్ల ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతులతో కలిసి కోర్టును ఆశ్రయించామన్నారు. పెద్ద చెరువులో ఎలాంటి పనులు చేపట్టవద్దని కోర్టు స్టే ఇచ్చిందన్నారు. అయినప్పటికీ అధికారులు కోర్టు ఆదేశాలను దిక్కరిస్తూ పనులు చేపడుతున్నారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలు ఉన్న పెద్ద చెరువులో పని చేయించడం కోర్టు ధిక్కరణే అవుతుందన్నారు. మీరందరి పైన కేసు నమోదు చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఏకా శివ, మాజీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర పాల్గొన్నారు.

## పోషణ పక్వాడపై అవగాహన కార్యక్రమం

**నర్సీపట్నం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త**



నర్సీపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ జీవి.రమణి ఆధ్వర్యంలో నర్సీపట్నం మండలం వేముల పూడిలో 8వ పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉపాధి హామీ శ్రామికుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు సెల్ఫోన్లు ఇవ్వడం ద్వారా కంటి చూపు, మెదడు అభివృద్ధిపై చెడు ప్రభావం చూపుతుందన్నారు. ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఇవ్వాలన్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నుండి ఆహారం తెచ్చి పిల్లలకు ఇవ్వరాదని, ఇంటిలో సహజంగా చేసిన ఆహారాన్ని మాత్రమే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

## రెన్యు సోలార్ భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**(రాంబిల్లి ఏప్రిల్ 23 ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం జెడ్ చింతవా పంచాయతీలో గురువారం జరిగిన రెన్యూ సోలార్ భూమి పూజ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు, ముందుగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదములు తెలిపారు, అనంతరం వేదికను అలంకరించిన పరిశ్రమ యాజమాన్యానికి, తోటి నాయకులకు, జిల్లా అధికార యంత్రాంగానికి, వేదిక కిందనున్న కార్యకర్తలకు, అభిమానులకు, ప్రజలకు, పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలకు నమస్కారాలు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్ ను ఆయన కొనియాడారు, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ రెండేళ్లలో ఇన్ని పరిశ్రమలను అనకాపల్లి జిల్లాకు తీసుకు రావడం అభినందనీయమని





పారిశ్రామికవేత్తలకు భరోసా ఇస్తూ ఉపాధి కల్పనే ధ్యేయంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారని అన్నారు, పరిశ్రమల స్థాపనలో పర్యావరణ పరిరక్షణకు కూడా పెద్దపీట వేస్తున్నామని గ్రీన్ ఎనర్జీ (హరిత ఇంధనం) ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుం దని ఎమ్మెల్యే వివరించారు, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం రాష్ట్రంలోనే ఒక కీలకమైన ఎనర్జీ హబ్ గా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్యరీత్యా ఈ శంకుస్థాపన కార్యక్రమానికి రాలేకపోయారని చింతించారు.

## బీసీలకు పెద్దపీట వేసింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ..

### - ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి
### - వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి" సీరం"

**(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు పెద్దపీట వేసిందని ఆ విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ,జిల్లా అనుబంధ సంఘాల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీరం నరసింహమూర్తి అన్నారు. శీరం నరసింహమూర్తి వ్యవసాయ క్షేత్రంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు తగు న్యాయం చేసిందని, కూటమి ప్రభుత్వం బీసీలకు హామీలు ఇచ్చి అవి నెరవేర్చకుండా పక్కదారి పట్టిస్తుందని అన్నారు. ఏ హామీలు అయితే ఎన్నికల్లో బీసీలకు ఇచ్చారు వాటిని తక్షణమే అమలు చేయాలని నరసింమూర్తి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా అనుబంధ సంఘాల్లో అధిక ప్రాధాన్యత కల్పించడం పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ,ఉత్తరాంధ్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కంబాల జోగులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అనంతరం జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఎన్నికైన మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొర్ల నరసింహమూర్తి, రాష్ట్ర బూత్ కమిటీల కార్యదర్శి గా ఎన్నికైన గొర్ల బాబురావు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శిగా ఎన్నికైన లోడగల చంద్రరావు లను నరసింహామూర్తి తో పాటు పార్టీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు ఎలమంచిలి తాతబాబు ,మాజీ సర్పంచ్ పల్లా చిన్నబ్బాయి, మత్స్యకార నాయకులు ఎరుపల్లి నగేష్, ప్రసాదుల శ్రీను తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

## శతాబ్ది ఉత్సవాలు ఏర్పాట్లు పరిశీలించిన భరత్ గుప్తా

**విశాఖపట్నం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**



ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవా లకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం డైరెక్టర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ భరత్ గుప్తా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజ శేఖర్ ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై కార్యక్రమ ఏర్పాట్ల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రధాన కార్యక్రమ వేదిక వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా వి.సి. ఆచార్య జి.పి.రాజశేఖర్ తో కలసి పర్యవేక్షించారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనుల ప్రగతిని తెలుసుకోవాలని సూచించారు. వేదిక అందంగా తీర్చిదిద్దడం,కార్యక్రమాల నిర్వహణ, గ్రీన్ రూములు, లాంజ్ గదులు ఏర్పాటు, గ్యాలరీలకు సూచిక బోర్డులు ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పార్కింగ్, తాగునీరు, అల్పాహారం వంటి సౌకర్యాలను సమయానికి అందుబాటులో ఉంచాలని, మధ్యాహ్నం తగు సమయం లోపు విద్యార్థులంతా వచ్చి కూర్చునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అతిథుల స్వాగతం, ఇతర ప్రొటోకాల్ అంశాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## అందమైన చేతిరాత మన భవిష్యత్తును లిఖిస్తుంది

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**



అందమైన చేతిరాత విద్యార్థుల భవిష్యత్తును లి ఖిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. గురువారం ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాలలో మోలానా అబుల్ కలాం అజాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేతిరాత శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదివి, అర్థం చేసుకుని పరీక్షలలో మెరుగైన ఫలితాలను సాధించడం ఎంతో అవసరమన్నారు. పోటీ తత్వం పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు శ్రద్ధగా చదవాలన్నారు. జీవితంలో ఉన్నతంగా రాణించాలనే ధృఢ సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో మకత్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఖాజ రహమతుల్లా, పాఠశాల ప్రిన్సిపాల్ సలోమి తదితరులు ప్రసంగించారు.

## ఇంటో్స ఒలింపియాడ్లో శ్రీ చైతన్య

**సంచలనం, ప్రభాతవార్త**



విశాఖపట్నం దేశవ్యాప్తంగా 3వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు ఇటీవల జరిగిన ఇంటో్స (ఇండియన్ నేషనల్ టేలెంట్ సర్చ్ ఒలంపియాడ్) 2025 పరీక్ష ఫలితాలలో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు రికార్డ్ స్థాయిలో అత్యధిక ర్యాంకులను సాధించి చరిత్ర సృష్టించారు. అలాగే ఉత్తరాంధ్రా జోన్ నుండి అత్యధికంగా 31 మంది విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్లు (ల్యాప్టాప్లు) సాధించడంతో పాటు 59 మంది ట్యాబ్లను సాధించారు. అదే విధంగా 213 మంది విద్యార్థులు టాప్ 5 ర్యాంకులను మరియు 3335 మంది విద్యార్థులు మెడల్స్ను సాధించారని, ఈ ఫలితాల ద్వారా భారతదేశంలో శ్రీచైతన్యయే నెం.1 అని మరోమారు నిరూపించిందని శ్రీచైతన్య కాలేజెస్, ఉత్తరాంధ్రా ఎ.జి.ఎమ్.కె.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య స్కూల్స్, అకడమిక్ డైరక్టర్ సీమ మాట్లాడుతూ ఈ ఇంటో్స ఫలితాలలో శ్రీచైతన్య స్కూల్, వైజాగ్ జోన్ రాష్ట్రంలోనే నెం.1 స్థానాన్ని నిలబెట్టుకుందని, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, వంటి విశిష్టమైన ప్రోగ్రాముల ద్వారా ఇంతటి ఘన విజయాలు సాధించగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య స్కూల్ రామ్నగర్ బ్రాంచ్లో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులకు శ్రీచైతన్య స్కూల్స్ ఉత్తరాంధ్రా ఎ.జి.ఎమ్ ఎమ్.వి. సురేష్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సభలో రీజనల్ ఇన్ఛార్జెస్ అహ్మద్ ఆలీ, గోపి, ప్రసాద్, జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్స్ రాజేష్ లెంక, రామారావు, అర్జున్, పట్నాయక్, ప్రిన్సిపాల్స్, అకడమిక్ డీన్లు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

## విమర్శాగ్రేసరుడు డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి

**ఆరిలోవ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**





ఆంధ్ర విశ్వ కళాపరిషత్ శతాబ్ది మహోత్సవాల సందర్భంగా 2342026వ తేదీ గురువారం ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ సమావేశ మందిరంలో "బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి" గారి సాహితీ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆంధ్రవిశ్వకళాపరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు గారు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వ కళాపరిషత్ మొదటి వైస్ ఛాన్సలర్ డాక్టర్ కట్టమంచి గురించి శతాబ్ది మహోత్సవాల సందర్భంగా సదస్సు జరగడం చాలా సంతోషం అని అన్నారు. మంచి పరిపాలన అధ్యక్షుడుగా, ప్రముఖ సాహితీ వేత్తగా,విఖ్యాత విమర్శకుడిగా, కట్టమంచి వారు పేరు ప్రఖ్యాతులు గడించారు అని అన్నారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తుకు రెండుసార్లు 19261930,19361949 వైస్ ఛాన్సలర్ గా చేసిన ఘనత కట్టమంచి వారికి దక్కింది అని అన్నారు కట్ట మంచివారు ముసలమ్మ మరణం, నవయామిని,కొన్ని కవితలు, కవిత్వతత్త్వ విచారం,అర్థశాస్త్రం, పంచమి,వ్యాస మంజరి, అనేక పీఠికలు రాసి తెలుగు సాహిత్య విమర్శలో తనకంటూ ప్రత్యేకమైన విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్నారని ఆచార్య జర్రా అప్పారావు గారు అన్నారు. "తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్" ఆచార్య నల్లా సత్యనారాయణ గారు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వ కళాపరిషత్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలుగు శాఖలో కట్టమంచి వారి మీద సదస్సు జరగడం చాలా మంచి పరిణామం అని అన్నారు. వీరిని స్మరించుకోవడం మన సంస్కారం.తెలుగు జాతిని గౌరవించుకోవడం కూడా. రెడ్డి గారు తన జీవితంలో ఎక్కిన సోపానాలు, అర్జించిన పాండిత్యం ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణం . మేధావుల్లో కట్టమంచి ప్రముఖులు. విద్య వైజ్ఞానిక రంగాలలో పేరెన్నికగన్నా మహనీయులు కట్టమంచి అని ఆచార్య నల్లా సత్యనారాయణ గారు అన్నారు. ఆచార్య గజ్జాయోహాన్ బాబు గారు మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డిగారు మంచి విద్యావేత్త. అంతేకాకుండా మంచి భవిష్యత్తు ప్రణాళిక కలిగినటువంటి వ్యక్తి . అందువల్లనే విశ్వవిద్యాలయాన్ని ఎక్కడ పెట్టాలి అనేటువంటి విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం అత్యద్భుతమని కొనియాడారు. విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించడమే కాకుండా అభివృద్ధికి ఆయన వంతు కూడా ఆ రోజుల్లో ఎంతో కృషి చేశారు. దానివల్ల ఇవాళ విశ్వవిద్యాలయం ఆయన వేసిన పునాది ఇవాళ ఎంతగానో బలపడి మంచి మంచి కోర్సులతోటి , విద్యార్థులతో యూనివర్సిటీ ఈ రోజు కళకళలాడుతుంది , ఆయన మంచి విద్యావేత్త. అంతే కాకుండా సాహిత్యంలో బాగా పట్టునటువంటి వ్యక్తి అందువల్ల ఆయనతో మాట్లాడేటప్పుడు కూడా ఆ రోజుల్లో ఆయన చాలా సరదాగా మాట్లాడేవారని, ఆయనతో మాట్లాడేటప్పుడు చిన్న చిన్న జోకులు మాట్లాడే వారని చెప్పినారు. కట్టమంచి వారు ఒక గొప్ప వ్యక్తి ,కవి, విమర్శకుడు , రచయితే కాకుండా మంచి పరిపాలనాధ్యక్షుడని , ఆయన జయంతి ఈరోజు తెలుగు శాఖలో జరగటం ఎంతో సంతోషమని తెలియజేశారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ ఆంధ్ర విశ్వకళా పరిషత్తు శతాబ్ద మహోత్సవం,ప్రపంచ పుస్తక దినోత్సవం,ఈరోజే కావడం కట్టమంచి వారి మీద సాహితీ సదస్సు జరగడం కట్టమంచి వారు వైస్ ఛాన్సలర్ గా మొట్టమొదటి వైస్ ఛాన్సర్గా పదవీ బాధ్యతలు చేసి నూరు సంవత్సరాలు అయిన సందర్భంగా ఆంధ్ర విశ్వ కళా పరిషత్ తెలుగు శాఖ లో కట్టమంచి వారి సాహితీ సదస్సు జరగడం చాలా సంతోషకరంగా ఉంది. ఆంధ్ర విశ్వకళా పరిషత్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం . ఆంధ్ర విశ్వ కళాపరిషత కళలకు నిలయమని . ఈ స్థాయికి ఈ విశ్వవిద్యాలయం రావడానికి ప్రధాన కారకులు,ప్రేరకులు డాక్టర్ కట్ట మంచి వారు అని కొనియాడారని ఆచార్య వెలమల సిమ్మన్న అన్నారు తెలుగుజాతిని నిద్ర నుంచి మేల్కొల్పిన వైతాళికుడు కట్టమంచి.తెలుగు సాహిత్య విమర్శపై గాఢమైన ముద్రవేశారు కట్ట మంచివారు.అసలు విషయం ఏమిటంటే సాహిత్య విమర్శ అంటే ఏమిటో తెలియజేసిన విమర్శాగ్రేసరుడు డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి గారని ఆచార్య సిమ్మన్నగారు అన్నారు.వీరి విమర్శ "కుండ బద్దలు" కొట్టినట్లు కాదు, "కొండ బద్దలు" కొట్టినట్లు ఉంటుంది. తెలుగు సాహిత్య విమర్శకు ఒక శాస్త్రీయ దృక్పథాన్ని అందించి అభినవ విమర్శకు మార్గదర్శకుడయ్యారు కట్ట మంచివారు. కట్టమంచి సిద్ధాంతాలు అందరికీ ఆదర్శం. తెలుగు సాహిత్య విమర్శకుల్లో అగ్రగణ్యులు కట్టమంచి. విమర్శ సిద్ధాంతాల్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసిన తొలి విమర్శకులుగా కట్టమంచి వారు మంచి పేరు తెచ్చుకున్నారు . తెలుగు సాహిత్య విమర్శలో ప్రథమ ఆచార్యులు కట్టమంచివారు. ఆచార్యులకే ఆచార్యులు కట్టమంచి రామలింగారెడ్డి గారు. కట్టమంచి చూపు ఆధునికం, భాష సనాతనం అని ఆచార్య సిమ్మన్నగారు అన్నారు. ఈ సభకు అతిథి అధ్యాపకులు డాక్టర్ కృష్ణవేణి ,డాక్టర్ దాసు ,డాక్టర్ ప్రతాప్ ,డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ గిరీష్, డాక్టర్ శివయ్య గారు హాజరయ్యారు. అంతేగాక విశాఖ పురజనులు, సాహితీ ప్రియులు, భాషాభిమానులు ఎంతోమంది హాజరైనారు ఈ సభకు స్వాగతం పి .స్నేహలత, వందన సమర్పణ బి .ఆశ చేశారు, సభ దిగ్విజయంగా జరిగింది.

## క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

### - డాక్టర్ కంభంపాటి హరిబాబు

**ఆరిలోవ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ విశాఖ నగర బైసన్ బౌన్సర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ఒడిస్సా రాష్ట్ర గవర్నర్ మాన్యశ్రీ గౌరవనీయ శ్రీ కంభంపాటి హరిబాబు గారు. నీతి నిజాయితీలు, కృషితోనే, ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు . అని గవర్నర్ గారు బౌన్సర్స్ కి సూచించారు మీ సంస్థ అత్యున్నత ప్రమాణాలు కలిగి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, బైసన్ బౌన్సర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మహమ్మద్ సుజావుద్దీన్ అన్సారి, టాంక్ అవతార్ సింగ్, అభి, గఫూర్, మున్నా, పవన్ కుమార్, సాగర్, మరగడ గౌరీ రెడ్డి, మొదలగు వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నారా లోకేష్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

**ఆరిలోవ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నారా లోకేష్ ఆల్ ఓవర్ వైజాగ్ క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహించనున్నట్లు 13వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు తెలిపారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గం టిడిపి నాయకులు కలిసి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఓపెన్ టోర్నమెంట్ మే 11వ తేదీ నుండి ఆరిలోవ పినాకిల్ గ్రౌండ్స్ లో జరగనున్నట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజుగా 1999/ అని, టోర్నీలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా ట్రోఫీ తో పాటు 70 వేలు, రెండో బహుమతిగా ట్రోఫీతో పాటు 30 వేలు, మూడో బహుమతిగా ట్రోఫీ తో పాటు 15 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఈ యొక్క టోర్నమెంట్ ను వార్డు అధ్యక్షులు ఏడవక సన్యాసిరావు ఆధ్వర్యంలో జరుగునున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఆర్గనైజర్స్ హరికృష్ణ, నూకరాజును సంప్రదించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెదేపా నాయకులు బుడుమూరు గోవింద్, పోత్రకొండ ధర్మారావు, తురకపూడి బాలస్వామి, ముగడ రాజారావు, గాడి సత్యం, పారిపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు ఈ నెంబర్లకు సంప్రదించాలని కోరారు. 8125426898, 8919260307, 9182936079.

## ఏయూ సుందరీకరణ

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఏప్రిల్23 ప్రభాతవార్త**



ఆంధ్రవిశ్వవిద్యాలయం మెయిన్గేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఫౌంటెన్ను ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశే ఖర్ ప్రారంభించారు. శతాబ్ది ఉత్సవాలలో భాగంగా విశ్వవిద్యాల యాన్ని సుందరీకరణ పనులు వేగంగా జరుపుతున్నారు. దీనిలో భాగంగా ఏయూ పరిపాలనం వద్ద నూతనంగా ఫౌంటెన్తో పాటు ప్రత్యేకమైన విద్యుత్ దీపాలతో అలంకరణ చేసారు. ఇవి వర్సిటీకి మరింత శోభను చేకూరుస్తున్నాయి. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ కె.రాంబాబు, డీన్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. రంగురంగుల విద్యుత్ దీప కాంతులతో ఫౌంటెన్ ఎంతో శోభాయ మానంగా దర్శనమిస్తోంది. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఏయూ అధికారులు పాల్గొని విజయవంతం చేసారు.

24skl13:24skl13.qxd 23-04-2026 22:28 Page 1



## పుస్తకానికి మించిన నేస్తం లేదు



కంచిలి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : మండలం బూరగాం ఉన్నత పాఠశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలతో పుస్తకం నమస్తుభ్యం అని చిత్రీకరించారు. ప్రధానోపాధ్యాయులు సోమేశ్వరరావు మాట్లాడుతూ పుస్తకానికి మించిన నేస్తం లేదని పాఠ్యపుస్తకములను కథల పుస్తకములను నిత్యం చదవాలని కోరారు. ఒక మంచి పుస్తకాన్ని మొదటిసారి చదివితే ఒక కొత్త స్నేహితుడిని పొందినట్టు ఉంటుంది. మళ్లీ మళ్లీ చదివితే పాత స్నేహితులని కలిసిన అనుభూతిని పొందవచ్చునని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భాష ఉపాధ్యాయులు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ప్రచురణ మరియు కాపీ హక్కుల ప్రాముఖ్యతను గుర్తించడం మొదలగు అంశాల గురించి తెలిపారు. అలాగే పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం లైబ్రరీలు పాఠశాలలు మరియు వివిధ సంస్థలలో పుస్తక ప్రదర్శనలు చర్చ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని ఇలాంటి కార్యక్రమాలకు విద్యార్థులు హాజరవ్వాలని కోరారు. రోజారాణి, చంద్రశేఖర్, కాంతారావు, చలపతి, నిరంజన్, ఎంవి రమణ, సోమేశ్, గణేష్ పాల్గొన్నారు.

## మీభద్రతే ... మా సంతోషం



కంచిలి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం నుండి వేసవి సెలవులు ప్రకటించిన సందర్భంగా బూరగాం ఉన్నత పాఠశాల ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక సూచనలను తెలియజేశారు. వేసవి సెలవులు ఏప్రిల్ 24 నుండి జూన్ 11 వరకు. పాఠశాలలు తిరిగి జూన్ 12వ తేదీన తెరవబడును. ఈ సందర్భంగా ఓ ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను సూచిస్తూ పెద్దలు లేకుండా కాలువలు చెరువులు, నదులు, సముద్రపు ఒడ్డుకు అస్సలు వెళ్ళవద్దు, నీటిలోతు తెలియకుండా సరదా కోసం నీళ్లలోకి దిగవద్దు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండలో బయట తిరగవద్దు, దాహం వేయకపోయినా చాలా నీరు త్రాగండి. మజ్జిగ, కొబ్బరి నీళ్ల శ్రేష్టమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సెల్ ఫోన్లు టీవీలు చూసే సమయాన్ని తగ్గించండి. మంచి కథల పుస్తకాలు నీతి కథలు చదవండి వ్రాయండి. అలాగే డ్రాయింగ్ పెయింటింగ్‌పై శ్రద్ధ చూపి ఇంటి వద్ద అమ్మానాన్నల వద్ద సెలవులను గడపడానికి ప్రయత్నం చేయండి. మీ భద్రతే మా సంతోషమని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన కరపత్రాలను విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



కోటబొమ్మాళి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలంలోని హరిశ్చంద్రపురంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి యు.వెంకటమురళి కష్ణ కోరారు. మే నెలలో కురిసిన వర్షాలకు పెసర, పిల్లి పెసర, కట్టి జనుము వంటి విత్తనాలు జల్లుకొని జూన్‌లో రైతులు తమ భూములను కలియ దున్నుకోవాలన్నారు. వరి పంట వేయటం వల్ల మొదటి సారి వేసే రసాయన ఎరువులను వినియోగించవలసిన అవసరం లేదని ఆయన తెలిపారు. రైతులు వాడే రసాయన ఎరువుల్లో 40శాతం ఎరువులు ప్రకృతి వ్యవసాయ పద్దతులు ద్వారా మొక్కకు అందించాలని ఈ విషయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని గ్రామీణ వ్యవసాయ సహాయకులను సూచించారు. కార్యక్రమంలో టెక్కలి ఏడీఏ ఏ.జగన్మోహన్‌రావు, ఏవో ఎస్.గోవిందరావు, వీఏఏలు ఉన్నారు.

## ఘనంగా ఆంగ్ల దినోత్సవం



కోటబొమ్మాళి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలం కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆంగ్ల దినోత్సవం ఘనంగా జరిపారు. ప్రముఖ ఆంగ్ల కవి విలియమ్ షేక్స్పియర్ జన్మ మరియు మరణ దినం అయిన ఏప్రిల్ 23న ఆంగ్ల దినోత్సవాన్ని అక్కడ ఆంగ్ల ఉపాధ్యాయులు షణ్ముఖ మాస్టర్ ఆ ఊరిలో ఆంగ్లంపై భయం పోగొట్టడానికి రకరకాల కళా రూపాలతో, కృత్యాలతో భాషను సమ్మిళితం చేసి పిల్లలకు ఆంగ్లంపై పట్టు సాధించడానికి తన వంతు కృషి, తనదైన శైలితో ముందుకు పోతున్నారు. ఇవాళ 50 రకాల ఆంగ్ల కవుల చిత్రపటాలు గురించి పిల్లలు వివరించారు. మిస్ బీమ్ స్కూల్ నాటికను, ఆంగ్ల భాష ఆవిర్భావంను హరికథ రూపంలో ఆంగ్ల భాషలో హారిక చెప్పే కథ ఆకట్టుకుంది. గ్రామర్ ఫ్యామిలీ, డోంట్ బి ల్యాజీ స్కిట్స్ మరియు ఆంగ్ల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. పిల్లలకు బహుమతులు అలాగే పదవ తరగతిలో ప్రవేశించే పిల్లలు అందరికీ స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. ఆంగ్ల భాషను ఇలా కసితో బోధించే ఉపాధ్యాయులు ఉండటం మా పాఠశాల అదృష్టమని బీవీ శాంతకుమారి కొనియాడారు. షణ్ముఖ మాస్టర్, వెంకటేశ్వరరావులను సత్కరించే కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే జిల్లా అభివృద్ధి



సీతంపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే జిల్లా అభివృద్ధి చెందుతుందని మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. సీతంపేట మండలం పెద్దగూడ పంచాయతీ, కురిసింగి, అంటి కొండ గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ ముస్తాబు కార్యక్రమంలో పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి పవర్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో ఆదివాసీలు ముందుకు వచ్చి గ్రామ ముస్తాబు కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రోడ్లు, తాగునీరు, విద్య, వైద్య సేవలు మెరుగుపరచడం అధిక ప్రాధాన్యత కల్పించడానికి నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ పరిశుభ్రత వల్ల వ్యాధులు తగ్గుతాయి. చెత్తను సరైన విధంగా పారవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఇంటి ముందు శుభ్రత పాటించాలని, పచ్చదనం పెంచడం ద్వారా గ్రామం అందంగా మారుతుందని, గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమని, మన గ్రామాన్ని మనమే అభివృద్ధి చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, ఎంపీడీవో బీబీ మిశ్రా, ప్రాజెక్టు ఉద్యానవనాల అధికారి వెంకట గణేష్, ఏఎంసీ చైర్మన్ సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఏపీవో విద్యాసాగర్, ఫకీరు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరఘట్టం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలంలో ఈ నెల 24వ తేదీ శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ వీరఘట్టం ఫీడర్ (నవగాం, వీరఘట్టం) నందు ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్లు తొలగించుట మరియు ఇతర పనుల నిమిత్తం వీరఘట్టం సబ్‌స్టేషన్ పరిధిలో వీరఘట్టం టౌన్‌తో పాటు 11 కేవీ బీటీవాడ, 11 కేవీ కడకెళ్ళ ఫీడర్స్‌పై ఉన్న అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా మాత్రమే జరుగుతుందన్నారు. 3 ఫేస్ విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుంది. వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా ఇంగ్లీష్ దినోత్సవం



వీరఘట్టం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలంలోని కత్తులకవిటి జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు పైల సుధారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి విద్యార్థులు టీఎల్ఎంలను పోటీపడి తయారు చేశారు. ఇవి మిగిలిన విద్యార్థులను కూడా ఆలోచింప చేసే విధంగా వాటిని తయారు చేశారు. ఆంగ్లంపై ప్రతి విద్యార్థి పట్టు సాధించాలని, ఇందుకు పట్టుదలతో ముందుకు సాగాలని హెచ్ఎం సుధారాణి పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థికి ఇంగ్లీష్ చాలా అవసరమని దీనిని విద్యార్థులు గుర్తెరగాలని ఆమె అన్నారు. విద్యార్థులతో ప్రత్యేకంగా టిఎల్ఎంలను తయారు చేయించిన ఇంగ్లీష్ అసిస్టెంట్ పి.గౌరీ శంకరరావును ప్రత్యేకంగా అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు బహుమతులను కూడా అందజేసి వారిని ఉత్సాహపరిచారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్యుమరేటర్ల శిక్షణ



వీరఘట్టం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తహశీల్దార్ ఎ.సాయి కామేశ్వరరావు ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహించిన ఎన్యుమరేటర్ల, పర్యవేక్షకుల శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణను విజయవంతం చేయించిన ఊన్న అన్నాజీరావు, ఆలుబిల్లి శ్రీహరి నాయుడులను తహశీల్దారు ఘనంగా సత్కరించి, మెమోంటోలను అందజేశారు. పలువురు శిక్షణ పొందిన వారు పాల్గొన్నారు.

## సత్వరమే సర్వేను వెంటనే పూర్తి చేయాలి



పాతపట్నం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలంలోని తిడిమి, పాతపట్నం 1 స్వర్ణ గ్రామాలను మండల స్వర్ణ గ్రామాల నోడల్ అధికారి బి. కృష్ణారావు గురువారం సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్.జి.ఎస్.డబ్ల్యు, వివిధ సర్వేలను ఆయన సమీక్షించారు. మిస్సింగ్ యుఎఫ్ఎస్, మనమిత్ర సిటిజన్ ట్రైనింగ్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఓపిటిఎస్ క్యుఆర్ ద్వారా ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరించారు. ప్రభుత్వ సర్వేలు, పౌరసేవలు విషయంలో సిబ్బంది అలసత్వం వహించరాదని ఆయన సూచించారు.

## 'విద్యతోనే సామాజిక వికాసం'



కవిటి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : సామాజిక వికాసానికి విద్య ఎంతగానో తోడ్పడుతుందని సోంపేటకు చెందిన శ్రీశయన చైతన్య దీపిక ప్రతినిధులు పేర్కొన్నారు. రాజపురం గ్రామంలో శ్రీశయన సంఘ భవనం వద్ద గురువారం విద్యా చైతన్య సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులను తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఇంట్లోనూ విద్యార్థి ప్రయోజకుడు అయినప్పుడే ఆ ఇంటిలో విద్యా దీపం వెలిగి ఎంతగానో వికసిస్తుందని కుటుంబం వృద్ధి చెందుతుందని అన్నారు. చిన్నప్పటి నుంచి పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి చదువుల విషయంలో వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో తగు విధంగా సహకరించాలని కోరారు. పిల్లలు ప్రయోజకులు అయ్యేంతవరకు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం తగదన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు బల్ల కాంతారావు, పఠ్రి సాయిరాజ్ సంస్థ ప్రతినిధులు దేవాడ మోహన్ రావు, దుద్ది వీర్రాజు మాట్లాడుతూ మారుతున్న విద్య పరిస్థితులకు అనుగుణంగా ఉద్యోగ పోటీ ప్రపంచంలో నిరంతరం విద్యార్థులు సైనికులుగా పోరాడాలని సూచించారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరేంత వరకు పట్టుదలగా శ్రమించాలని సూచించారు. బల్ల జానకిరావు, బీన ఆనందరావు, దూగాన లోకనాథం, పఠ్రి చంద్రయ్య, లొట్టి సోమేశం, బత్తిన హేమాచలం, ఆణింగి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## భరత్ కుటుంబానికి బాసటగా 'కడియాల'



కవిటి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : పక్షవాత వ్యాధితో బాధపడుతూ మంచాన్ని పట్టిన బోగిడియా భరత్‌కు, అలానే మానసిక వికలాంగులైన భార్య సీతకు బాసటగా కవిటి మండలం వైయస్సార్ పార్టీ అధ్యక్షులు కడియాల ప్రకాష్ బాసటగా నిలిచారు. గురువారం రాజపురం గ్రామానికి వెళ్లి భరత్ ఇంటి వద్ద 5000 రూపాయల నగదుతో పాటు రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను అందించే కార్యక్రమం చేపట్టారు. అంతేకాక ఆయనకు ప్రభుత్వ పింఛను అందే వరకు తన వంతుగా నెలకు 2,000 ఆర్థిక సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఎంపీటీసీ సనపల కృష్ణారావు,మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు నీలయ్య, ఢిల్లీబాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ భూములను కాపాడాలి



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : మున్సిపాల్టీ పరిధి ఇండియన్ గ్యాస్ గొడౌన్ ఎదురుగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయంకు సంబంధించిన భూమిని పట్టణానికి చెందిన కొందరు కబ్జా చేశారని ఆలయ అర్చకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం విలేఖర్ల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ అర్చకులు మన్మోహన్ పండా, తల్లి నిరుపమ పండాలు ఇద్దరు తాము ఎదుర్కొం టున్న సమస్యలను వెల్లడించారు. ఆలయానికి సంబందించిన 6.54 ఎకరాల భూమి ఉండేదని, దాంట్లో 6ఎకరాలు ఆర్టీసీ డిపో కట్టేందుకు మరికొంత భూమి సంతోషిమాత, తారకేశ్వర ఆలయ నిర్మాణానికి ఇవ్వటం జరిగిందని, మిగిలిన భూమి దేవాలయం ఆధీనంలో ఉండేదని, దీనిపై కన్నేసిన పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని అడిగితే ఎదురు తిరుగుతున్నారని,మాకు పట్టాలు ఉన్నాయని ఆ స్థలం మాదే అని బెదిస్తున్నారని, ఈ విషయాన్ని గతంలో జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీఓకు, స్థానిక తాహశీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేయటం జరిగిందని అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవటం లేదని కన్నీరు పెట్టుకొని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు కూడా ఈ సమస్య వివరించామని, ఎటువంటి నష్టం కలగకుండా చూస్తామని ఆలయానికి సంబంధించిన సెంటు భూమి కూడా పోదని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి న్యాయం చేస్తారని భావిస్తున్నామన్నారు.

## భూముల రీసర్వేను విజయవంతం చేయండి : తహసీల్దార్



వీరఘట్టం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: వీరఘట్టంలో త్వరలో చేపట్టనున్న భూముల రీ సర్వే రైతులు, ప్రజలు పూర్తిగా విజయవంతం చేయాలని తహాశీల్దారు ఎ.సాయి కామేశ్వరరావు కోరారు. గురువారం స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్లు తప్పు పడినా, భూమి విస్తీర్ణం తక్కువ, ఎక్కువగా ఉన్నా, సర్వే నంబర్లకు, రైతులకు పొంతన లేకుండా ఉన్నా తదితర అంశాలను ఈ సర్వేలో సరి చేయడం జరుగుతుందన్నారు. రీ సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా తమ సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారని ఆయన అన్నారు. ఇందుకు రైతులు తమకు సహకరించాలని ఆయన కోరారు. వీఆర్వోలు వంజరాపు రమేష్ కుమార్ దుర్గారావు పెద్దలు జామి లక్ష్మీనారాయణ, జంపు శేఖర్, పప్పల మహేష్, పొట్నూరు కోటేశ్వరరావు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రాజాం కమిషనర్‌కు అరుదైన పురస్కారం



రాజాం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీలలో మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నుల వసూళ్లలో మంచి ప్రతిభ చూపించినందుకు గాను రాజాం మునిసిపల్ కమీషనర్ ఆకురాతి రామచంద్రరావు విజయవాడలో జరిగిన మున్సిపల్ కమీషనర్ల సదస్సులో మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ యస్. సురేష్‌కుమార్ పురపాలక శాఖ సంచాలకులు పి.సంపత్ కుమార్ దుశ్శాలువతో పాటు, మెమంటో, నగదుతో సన్మానించటం జరిగినది.నీ అరుదైన పురస్కారం వచ్చినందుకు కమిషనర్ రామచంద్రరావుకు కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగులో పంట కోత సంబరాలు



సరుబుజ్జిలి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : మండలంలో వెన్నెలవలస గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుక్కు దున్నకుండా సాగు చేసిన మొక్కజొన్న పంట కోత సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటి నాయుడు మాట్లాడుతూ, దుక్కు దున్నకుండా మొక్కజొన్న సాగు చేయడం వలన అధిక దిగుబడి సాధించడమే కాకుండా, రెండు తడుల నీటిని ఆదా చేయవచ్చునని ఖర్చు తగ్గుతుందని రైతులకు తెలిపారు. అంతే కాకుండా ఈ సంవత్సరం దుక్కు దున్నకుండా మొక్కజొన్న ఎనిమిది వందల ఎకరాలు వరకు సరుబుజ్జిలి మండలంలో సాగు చేశారని అన్నారు. దుక్కు దున్నకొండ మొక్కజొన్న సాగు చేయడం వల్ల ఎకరాకు ఆరు క్వింటాలు వరకు అదనపు దిగుబడి వచ్చింది. గతంలో 30 క్వింటాలు వస్తే, ఇప్పుడు 36 క్వింటాలు పైనే దిగుబడి వచ్చిందని అభ్యుదయ రైతు సవర సుధాకర్ ఆనందం వ్యక్తం చేశారు. పంట కోత అనంతరం పంట వ్యర్థాలను కాల్చడం వలన వాతావరణ కాలుష్యమే కాక భూసారం కూడా క్షీణిస్తుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ సమన్వయకర్త ఏ.లావణ్య అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్తలు పి శ్రీనివాస్, ఎస్.కుమారి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోషకాహారంపై అపోహ వద్దు... ఆరోగ్యంపై అవగాహనే ముద్దు



కొత్తూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : దేశ భవిష్యత్తు చిన్నారుల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని మండల వైస్ ఎంపీపీ, తెదేపా సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు పిలుపునిచ్చారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిశువు జన్మించిన మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని, ఇది బిడ్డకు తిరుగులేని రోగనిరోధక శక్తిని అందిస్తుందని బాలింతలకు సూచించారు. గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలు సరైన సమయంలో పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. పోషకాహారం అంటే కేవలం ఖరీదైనది అనే అపోహను ప్రజలు వీడాలని, మన ఇళ్లలో నిత్యం లభించే ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, పాలు మరియు గుడ్ల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల పనితీరు మెరుగుపడాలి : ఎంపీడీవో



కవిటి, ఏప్రిల్23, ప్రభాతవార్త: అంగన్వాడీల పని తీరు మరింత మెరుగుపడాలంటూ కవిటి ఎంపీడీవో ఎల్.త్రినాథ్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో గల ఐదు అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీవో త్రినాథ్ పర్యవేక్షించారు. బాలింతలకు చూలింతలకు అలానే మూడు సంవత్సరాల పిల్లలకు అందిస్తున్న సరుకులను సక్రమంగా అందుతున్నాయా లేదా పరిశీలన చేశారు. అంగన్వాడీ కేంద్రాల సమీపంలో గల పరిసరాలను పరిశీలించి చుట్టుపక్కల ప్రదేశాలను శుభ్రం చేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు తెలిపారు. రీసెర్చ్‌పర్సన్ జీవన్‌మూర్తి పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## 'బాహుద వంతెన నిర్మించే వరకు ఆందోళన ఆగదు'



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : బాహుదా వంతెన సగ భాగం కూలి మూడేళ్ల గడిచినా ఇంత వరకు కూటమి ప్రభుత్వం పనులు చేపట్టక పోవటం దారుణమని పనులు ప్రారంభించేంత వరకు వైస్సార్సీపీ పోరాటం చేస్తుందని వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం బాహుదా వంతెనను వైస్సార్సీపీ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపటం కారణంగానే ఇంత వరకు వంతెన పనులు ప్రారంభం కాలేదని వంతెన లేక ప్రజలు, వ్యాపారులు పడుతున్న బాధలు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు కనిపించటం లేదా అని ప్రశ్నించారు. కూటమిలో ఉన్న జనసేన పార్టీ నాయకులు ప్రశ్నిస్తామన్న నినాదంతో ముందుకొచ్చిన వారికి వంతెన ప్రజల బాధ వినిపించటం లేదా అని అన్నారు. 2023 మేనెలలో వంతెన సగం భాగం కూలిపోయిందని, దానికి అప్పటి వైస్సార్సీపీ ప్రభుత్వం నిధులు కేటాయించి తాత్కాలిక పనులు చేపట్టడం జరిగిందని, తరువాత జీవోనెం 264 తెచ్చి నూతన వంతెన నిర్మాణం చేపట్టేందుకు రూ.20కోట్లు మంజూరు చేసిందని అన్నారు. టెండర్ ప్రక్రియలో ఉన్నప్పుడే ఎలక్షన్ కోడ్ రావటంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. తరువాత అదికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 2024 సెప్టంబర్ 27న అప్పటి వరకు ఉన్న అన్ని టెండర్లు రద్దు చేసిందని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పనులు ప్రారంభించాలని లేదంటే వైసీపీ ఉద్యమం చేపడుతుందని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, కేంద్రమంత్రి మొద్దు నిద్ర వదలి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ మాజీ వైస్ ఛైర్పర్సన్ ఉలాల భారతి దివ్య, ఎంపిపిలు బోర పుష్ప, పైల దేవదాస్ రెడ్డి, దేవరాజు, ప్రేమ్ కుమార్, ఢిల్లీ, తేజ, అన్వేష్, వంశీ, గాంధీ, తిరుపతి, జయరాం, మోహన్ దాస్, రాజశేఖర్, త్రినాథ్, మోహన్‌రావు, దీనబందు, సుల్తానా, రామ్మూర్తి, సత్యం, సంతు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అత్యుత్తమ గ్రామ పంచాయతీగా సంతబొమ్మాళి



సంతబొమ్మాళి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లాలో సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ అత్యుత్తమ గ్రామ పంచాయతీగా గుర్తింపు పొందింది. ఈ మేరకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక పరిపాలన సంస్థ అధికారులు గురువారం సంతబొమ్మాళి గ్రామ పంచాయతీని సందర్శించారు. పంచాయతీ కార్యలయం రికార్డులను పరిశీలించిన అధికారులు పారిశుద్ధ్యం, వీధి దీపాలు నిర్వహణ తదితర అంశాలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పచ్చదనం పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన గ్రామ పంచాయతీగా గుర్తించారు. ఈ మేరకు కేరళ రాష్ట్ర స్థానిక పరిపాలన వ్యవహారాల సంస్థ డైరెక్టర్ వి.పి సుకుమార్ ఐఎస్ఓ 9001-2015 అంతర్జాతీయ ప్రామాణిక ధ్రువీకరణ పత్రంను పంచాయతీ కార్యదర్శి దుంపల శ్రీనివాసరావుకు స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయితీరాజ్ కార్యాలయం అధికారి ఇమాముద్దిన్, డివిజనల్ దెవలప్‌మెంట్ అధికారి అలివేలు మంగమ్మ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జయంత్ ప్రసాద్, తహసిల్దార్ బి.హేమసుందర్, మండల స్వర్ణ గ్రామం అధికారి సి.హెచ్.లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపీడీఓ దుంపల శ్రీనివాస్, పంచాయతీ అభివృద్ధి అధికారి గేదెల విజయ్ కుమార్ వర్మ, విలేజ్ రెవెన్యూ అధికారి జె.భాస్కర్, స్వర్ణ గ్రామ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అలాగే గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ పిఎసిఎస్ అధ్యక్షులు కూచెట్టి కాంతారావు, మాజీ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ, మెండ అప్పారావు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరాలి : సిరిపురం



పాతపట్నం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : పాతపట్నం నియోజకవర్గ పరిధిలో ప్రతి గ్రామంలో బిజెపి జెండా ఎగరవేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక బిజెపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ విధంగా అన్నారు. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీని ప్రజలు అక్కున చేర్చుకున్నారని తెలిపారు. దేశ అభివృద్ధికి మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. నకిలీ ఓట్లను తొలగించి, దేశ పౌరులకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించాలని దృఢ సంకల్పంతో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. పాతపట్నం నియోజవర్గంలో బిజెపి పార్టీ బలాన్ని పుంజుకుం టుందని, ఇప్పటికే కార్యకర్తలు,నాయకుల సహకారంతో 30 వేలకు పైగా ప్రాథమిక సభ్యత్వాలు నమోదు చేయడం జరిగిందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రంలో బిజెపి జెండా ఎగిరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి ఆలయంలో 51 వ వార్షికోత్సవ నవరాత్రి యాత్ర మహోత్సవాల్లో భాగంగా సిరిపురం తేజేశ్వరరావు త్రివేణి దంపతులు, బిజెపి శ్రేణులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

## పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం




పాతపట్నం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : స్థానిక ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలలో గురువారం ఆంగ్లభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు శోభారాణి, డిల్లేశ్వరి, రాజారావు మాస్టారును ప్రిన్సిపాల్ రత్నకుమారి సత్కరించారు. ఆంగ్ల భాషకు 1,700కు పైగా పదాలను అందించిన విలియం షేక్స్పియర్‌ను గౌరవించటానికి, ఏప్రిల్ 23న ఆంగ్ల భాషా దినోత్సవాన్ని జరుపుకుంటారని వారు పేర్కొన్నారు. అనంతరం ఒకేషనల్ టీచర్స్ వై.నరేష్ కుమార్, నల్ల రాంప్రసాద్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదరావు, ఇతర ఉపాధ్యాయులు, దసరా సెలవుల్లో మరియు వేసవి సెలవులు ఇంటర్నషిప్ పూర్తి చేసుకున్న ఇంటర్మీడియట్ మరియు పదవ తరగతి ఒకేషనల్ విద్యార్థులకు టూల్ కిట్స్ మరియు టీ షర్ట్స్ ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఒకేషనల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా నారసింహుని వార్షిక ఉత్సవ కరపత్రాలు విడుదల



కొత్తూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధిలోని మహాసింగి గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకలకు సంబంధించిన కరపత్రాలను గురువారం స్వామివారి సన్నిధిలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గోగుల వరప్రసాద్ నాయుడు మాట్లాడుతూ, ఈ నెల 29వ తేదీన ప్రారంభం కానున్న ఈ వార్షికోత్సవ వేడుకలు మొత్తం ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా కొనసాగి మే 3వ తేదీతో ముగుస్తాయని వివరించారు. ఈ ఐదు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించడంతో పాటు భక్తుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు మరియు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాలకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు శెట్టి భానూజీ రావు, పిన్నింటి రామారావు నాయుడు, ఇప్పిలి జానకిరామయ్య, ఎడ్ల గోవిందరావు, ఆశపు ముకుంద, మాదాసు శంకర్ మరియు స్వామి వారి సేవకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వార్షికోత్సవ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

## 'జనగణనను బాధ్యతగా నిర్వర్తించాలి'



గరివిడి, ఏప్రిల్23, ప్రభాత వార్త: జనగణన కార్యక్రమం బాధ్యతగా ఎన్యుమరేటర్లు నిర్వహించాలని, డేటా సేకరణలో ఖచ్చితత్వం అత్యంత కీలకమని తహశీల్దార్ చింత బంగార్రాజు, ఎంపిడిఓ ఎంవిబి సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రతీ ఇంటి సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేయాలని వారు ఎన్యుమరేటర్లు కి సూచించారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం లో జనాభా గణనపై ఎన్యుమరేటర్లుకి మూడు విడతలుగా10 రోజులు పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపిడిఓ లు మాట్లాడారు. జనాభా గణన గణాంకాలు భవిష్యత్తు ప్రణాళికలకు పునాది వంటి వని వారు పేర్కొన్నారు. స్వీయ గణన వినియోగంపై ప్రజానీకానికి విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేటర్లు అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం జన గణన పై ఐ వి ఆర్ ఎస్. నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ ప్రతీ ఇంటి తలుపు తట్టాలన్నారు. గడప గడప కు వెళ్లి నిబద్ధతతో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.జన గణన పై ఏ ఒక్క ఇంటిని కూడా వదలకూడదని స్పష్టం చేశారు. శత శాతం వివరాలు నమోదు చేసి 33 ప్రశ్నల వివరాలు పొందుపరచాలని వారు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పది రోజులు పాటు శిక్షణ ఇచ్చిన మాస్టర్ ట్రైనర్లు బురిడి ఆనంద్, రమేష్ చంద్ర లకు తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపిడిఓ ఎం వి బి సుబ్రహ్మణ్యం లు దుస్సాలువతో సత్కరించారు. తమకు సత్కరించిన అధికారులకి మాస్టర్ ట్రైనర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపిడిఓ (పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి) ఎల్.పుష్పాంజలి, డెప్యూటీ ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.

## అన్నక్యాంటీన్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే




రామభద్రపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: రామభద్రపురం మేజర్ పంచాయతీలోని అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్తున్నట్లు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనా అన్నారు రామభద్రపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు కూటమి ప్రభుత్వ పాలనలో తాగునీరు రహదారులు పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు అవుతున్నాయని ఆయన అన్నారు పెద్ద గడ్డ ఏడుపులు గడ్డ సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వ నిజం మంజూరు చేస్తుందని ఆయన అన్నారు రామభద్రపురంలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు మరియు ప్రధాన రహదారి కాలువలకు నిధులు మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఆయన అన్నారు రామభద్రపురం మండలంలోని మారుమూల గ్రామాల్లో తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు గిరిజన గ్రామాల్లో రహదారులు నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఆయన అన్నారు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధులు కింద మూడు కోట్ల రూపాయలు అందించడం జరిగిందని ఆయన అన్నారు ఎవరికైనా అనారోగ్యం చెందినట్లైతే వారంతా ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో తెదేపా మాజీ కార్యనిర్వక కార్యదర్శి చింతల రామకృష్ణ మండల తెదేపా అధ్యక్షుడు కరణం భాస్కరరావు మండల తెదేపా నాయకులు చింతల చిన్నమ్మ తల్లి వసంతల సన్యాసినాయుడు సిరిపురం శ్రీనివాసరావు పూడి రామ నాయుడు మజ్జి రమేష్ తూముల గోపాలకృష్ణ గనివాడ సత్యనారాయణ చొక్కాపు అప్పల నాయుడు మాదిరెడ్డి రామకృష్ణ చింతల కృష్ణ బి చిన్నారావు బి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 10 వేలు జరిమానా

రామభద్రపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తి పట్టుబడితే పదివేల రూపాయలు జరీ మన విధిస్తున్నట్లు ఎస్సై జాన్ ప్రసాద్ తెలియజేశారు గురువారం బైపాస్ జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడ్డ పురిపండ శ్యామ్ కుమార్ పెద్ద కోమటి పేట సాలూరు టౌన్ అను అసామిని ఈరోజు సాలూరు కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ జి హర్షవర్ధన్ అతనికి పదివేల రూ జరిమానా విధించారని తెలియజేశారు. ఇకముందు ఇలా పట్టుపడితే కేసుతోపాటు జరిమైన విధించడం తప్పనిసరి అని దీన్ని వాహన సాధకులు గ్రహించాలని అన్నారు.

## సందడిగా శ్రీ వెంకటవిద్యాగిరి పాఠశాల వార్షికోత్సవం



సాలూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : సాలూరు పట్టణ చిన్నబజార్ సమీపంలో ఆవుదూడ చౌత్రి ప్రక్కన ఉన్న శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల 36వ వార్షికోత్సవం కరెస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. గురువారం కార్యక్రమంలో ముందుగా శ్రీ సత్య సాయిబాబా చిత్రపటానికి సాయి శ్రీనివాస్ చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన గావించారు.అలాగే విద్యార్థిని విద్యార్థులు వేసిన నాటికలు ఎవరుగొప్ప ఇంకా న్యాయంగొప్ప అలాగే మనమేలు కోరేవారు అనే సందేశాత్మక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.అంతేకాకుండా కామెడీ స్కిట్లు ఇంకా సినిమాసాంగ్స్ కు డాన్స్ వేసి సందడి చేశారు.అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతు దేశ భవిష్యత్తు విద్యార్థులు చేతిలో ఉంటుందని అందరూ బాగా చదువుకుని పుట్టిన ఊరుకి, తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్కూల్ టీచర్స్,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా పుస్తక దినోత్సవం

నెల్లిమర్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.కె.రేఖ అధ్యక్షతన వరల్డ్ బుక్ డే, నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల సీ.పీ.డి.సీ మెంబర్, ఎయిమ్ విద్యాసంస్థల అధినేత కడగల ఆనంద్ వ్యవహరించారు. మొదటగా నేషనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే సందర్భంగా, డైట్ కళాశాల లెక్చరర్ కానూరు అన్నారావు ప్రసంగిస్తూ షేక్స్పియర్ రచనలు, వాటి విశిష్టత నాలుగు శతాబ్దాలు దాటినా ఆ రచనల యొక్క ప్రాముఖ్యత, విస్తృత గురించి, ఆ రచనలో ఉన్న సొగసు, క్యారెక్టర్ల గురించి సవివరంగా వివరించారు. కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ, షేక్స్పియర్ రచనలు పిల్లలందరూ చదవాలని, ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ మాట్లాడుతూ మనిషిని అజ్ఞానం నుండి జ్ఞానానికి మార్పు చేసేది పుస్తకమని, పుస్తకాలు చదివినకొద్దీ విశాల దృక్పథం అలవడుతుందని , దీనితో పాటు వ్యక్తి మానసిక పరివర్తన కూడా మార్పు చెందుతుందన్నారు. ఈ మార్పు సామాజిక పరివర్తనకు చాలా ముఖ్యమని తెలిపారు. మహారాజా సంస్కృత కళాశాల పూర్వ ప్రాచార్యులు, డాక్టర్ అయ్యల సోమయాజుల గోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులంతా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.అప్పారావు, ఐక్యూఎస్సి కోఆర్డినేటర్ డాక్టర్. జి. వి.ఎస్. జయపాల రావు, పిల్లలను ఉద్దేశించి, పుస్తక పటన ఆసక్తిని పెంచే విధంగా పలు విషయాలను తెలిపారు. కళాశాలలో ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ డి.మాధురి, నేషనల్ లాంగ్వేజ్ డే కు, తెలుగు విభాగాధిపతి, డాక్టర్ ఎం. రమా గీతా దేవి, తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారసాం ఉన్నత పాఠశాలలో...




నెల్లిమర్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : మండలంలోని పారసాం ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ భాషా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టువంటి ఇంగ్లీష్ ఎగ్జిబిషన్ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ 2 సిద్ధాంతం త్రినాధ రావు లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు 50 పైగా ఇంగ్లీష్ అంశాలకు సంబంధించినటు వంటి ప్రాజెక్ట్స్ ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్ ప్రాధాన్యతను త్రినాధరావు, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్. రాంబాబు, ఆంగ్ల ఉపాధ్యాయులు ఎన్. వెంకట ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు ప్రసాద్ని ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆంగ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా రామచంద్ర స్వామికి పట్టాభిషేకం



నెల్లిమర్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ రామ స్వామి దేవాల యంలో గురువారం శ్రీరామచంద్రుని జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని అర్చకులు శ్రీ రామచంద్ర స్వామికి పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో గురువారం ఉదయం ప్రాతః కాలార్చన బాలభాగం, యాగశాలలో సుందరకాండ హావనం నిర్వహించి అనంతరం శ్రీరామస్వామి వారికి నిత్యకళ్యాణం నిర్వహించారు. మార్చి27వ తారీకు పునర్వసు నక్షత్రంన ప్రారంభించి ఈరోజు పునర్వసు నక్షత్రం వరకు 27 రోజులు శ్రీ రామ స్వామి వారి దేవాలయంలో శ్రీమద్రామాయణ పారాయణం నిర్వహించి గురువారం ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులు వద్ద రామాయణంలో పట్టాభిషేకం సర్గ విన్నవించి శ్రీ రామచంద్ర స్వామి వారికి పంచామృతములతో అభిషేకము, పట్టాభిషేకం నిర్వహించారు.ఈసందర్భంగా శ్రీ రామచంద్ర స్వామి వారిని విశేషంగా పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమాలు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వై శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, ఖండవిల్లి కిరణ్ కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పానంగిపల్లి ప్రసాద్, సుదర్శనం పవన్ కుమార్ రాంగోపాల్ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగి రామారావు, భక్తులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



కొమరాడ,ఏప్రిల్ 23, ప్రభాత వార్త: మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా పి. శ్రీనివాసరావు, సీనియర్ సహాయకులుగా లీ.దిబీ.సత్య ప్రసాద్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. శ్రీనివాస రావు గరుగుబిల్లి మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతపై కొమరాడ వచ్చారు సత్య ప్రసాద్ జిఎంవలస మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతపై ఇక్కడికి వచ్చారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో మండల అభివృద్ధి కృషి చేస్తామన్నారు.

## మా పేరు మీద ఎక్కని భూమి... వేరే వాళ్ల పేరుమీద ఎలా ఎక్కించారు



దత్తిరాజేరు ఏప్రిల్ 23 ప్రభాత వార్త : మండలంలోని ఎస్. బూర్జు వలస రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 9(1) లో మరడ లేటు రామ్మూర్తి పేరున రెవెన్యూ రికార్డులు సుమారు నాలుగు ఎకరాలు భూమి ఉండేది ఆ భూమిని సాగు చేసుకుని కుటుంబం అందరం బ్రతికేవారు మని మా నాన్న అమ్మ మరణించిన తర్వాత వారసత్వముగా మాకు చ్నెదాల్సిన భూమి మా పేరు మీద ఎక్కించకుండా వేరొక పేరున ఎక్కించి ఆన్లైన్లో వన్ బి కూడా వస్తుందని కుమారులు మరడ చిన్నం నాయుడు సింహాచలం స్థానిక విలేకరులు ముందు మొరపెట్టుకున్నారు ఆ భూమి మా పేరు మీద మార్చమని రెవెన్యూ కార్యాలయం మరియు అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన పట్టించుకోలేదని ఆ భూమి ప్రభుత్వ భూమిని 22 ఏ లో ఉందని ఆ భూమి మీ పేరున ఎక్కదని అధికారులు చెప్పడంతో మనసు చాలించి ఆ భూమిని సాగు చేసుకుని బ్రతుకుతున్నామన్నారు ఆ భూమి ఆన్లైన్లో చూసేసరికి వేరొక పేరు వస్తుందని 2025 జూన్ జూలై నెలలో భూమి వేరొక పేరు మీద మార్చినట్లు ఉందన్నారు వారసులుగా మాకు చెందవలసిన భూమిని వేరొక పేరు మీద ఆ భూమి ఎక్కించారని మాకు ప్రభుత్వ భూమి మీ పేరుని ఎక్కదని చెప్పి అదే ప్రభుత్వ భూమి వేరే వాళ్ళకి ఎలా ఎక్కించారని వారికి ఒక న్యాయమా మాకు ఒక న్యాయమా ఇది ముమ్మాటికి రెవెన్యూ అధికారులు చేసిన పనేనని బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు 22ఎ ప్రభుత్వ భూమిని జిరాయితిగా మార్చి పాసుబుక్కుల్లోకి సర్వే నంబర్ ఏ క్కించేసారని అంగ ధన రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులకు ఎటువంటి భూములైన అధికారులు వాళ్లకు భయపడి ఎక్కించేస్తారని పేదవాళ్లవైపు ఏ అధికారి రాజకీయ నాయకుడు పట్టించుకోరు అన్నారు 22ఏ ప్రభుత్వ భూములు మార్చేటప్పుడు ఆర్డిఓ, జె.సి అనుమతులు లేకుండా మండల తాసిల్దార్ కార్యాలయంలో మార్చారని వారసులు తెలిపారు ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత రెవిన్యూ రికార్డులులో మా తండ్రి పేరు మీద ఉన్న భూమిని వారసులుగా ఉన్న మా ఇద్దరి అన్నదమ్ములు పేరున నాలుగు ఎకరాలు భూమిని ఎక్కిస్తారని అధికారులని కోరుకుంటున్నాం.

## జల సంరక్షణే ధ్యేయంగా ... జలధార, జలహారతిపై సమీక్ష




లక్కవరపుకోట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు, నీటి వనరులను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నామని ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం లక్కవరపుకోట మండల పరిషత్ కార్యాలయంలో ఖిజలధారజలహారతిఖి పథకంపై అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐదు మండలాలకు చెందిన ఎంపీడీవోలతో పాటు ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు మరియు టెక్నికల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపడుతున్న నీటి సంరక్షణ పనులు, ఆయా మండలాల్లో ఇరిగేషన్ వ్యవస్థల పరిస్థితిపై ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు ఎమ్మెల్యే కీలక సూచనలు చేశారు. ఎమ్మెల్యే కోళ్ల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఖిజలధారజలహారతిఖి పనులలో నాణ్యతతో పాటు, వేగం కూడా ముఖ్యమని అధికారులకు స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు నీటి లభ్యతను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏ ఏంసి ఛైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ క్లస్టర్ ఇంచార్జీ కొల్లి రమణ మూర్తి,ఏ ఎం సి డైరెక్టర్ పుట్టా శ్రీనివాసరావు, జలవనరుల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు ,పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి



సాలూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : నార్లవలస పంచాయతీ బొర్ర పలుకు వలసకు చెందిన చిక్కుడు.సర్చునాయుడు (66) అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్.ఐ.రవీంద్ర రాజు వివరాలు ప్రకారం ఈనెల 21వ తేదీన మంగళవారం ఒరిస్సా సుంకి గ్రామానికి తన బంధువులు ఇంటికి అతను వెళ్లినట్లుతెలిపారు. అలాగే మరునాడు బుధవారం ఉదయం 9 గంటలకు సర్చునాయుడిని బంధువులు బస్సు ఎక్కించి తిరిగి పంపించేశారన్నారు.కానీ గురువారం పసుపు వానివలస గ్రామం సమీపంలో ఉన్నకాజ్వే దగ్గర సర్చునాయుడు మృతి చెందినట్లుగా తన కుమారులకు ఫోన్ చేసి స్థానికులు తెలిజేసారన్నారు.వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతి చెందినది తమ తండ్రే అని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేసారన్నారు.దీనిపై కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించామని పూర్తి వివరాల త్వరలో తెలియజేస్తామని ఎస్.ఐ.రవీంద్ర రాజు స్థానిక విలేకరులకు తెలిపారు.

విజయనగరం 25
పార్వతీపురం మన్యం
వార్త

## మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కోళ్ల



లక్కవరపుకోట, ఏప్రిల్ 23, ప్రభాత వార్త : విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికతతో కూడిన భోజనం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె స్థానిక లక్కవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, ప్రభుత్వం అమలు చేస్తున్న ఖిడొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంఖి నిర్వహణను, భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాల వంటగదిని, స్టోర్ రూమ్ను తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం, కూరలు, ఇతర పదార్థాల నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంట చేసే ప్రదేశంలో పరిశుభ్రతను పాటిస్తున్నారా? లేదా? అన్న విషయాలను స్వయంగా గమనించారు.పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎటువంటి రాజీ పడకూడదు. మెనూ ప్రకారం రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలి. ఆహారం వడ్డించే సమయంలోనూ, వంట గదిలోనూ అత్యున్నత ప్రమాణాలు పాటించాలి అని ఆదేశించారు. అంతేకాకుండా, విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, పిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.. కార్యక్రమంలో తిలీది చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ క్లస్టర్ ఇంచార్జీ కొల్లి రమణ మూర్తి, ఏఎంసి డైరెక్టర్ పుట్టా శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పవన్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



బొబ్బిలి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకొని హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్న జనసేన పార్టీ అధినేత , ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో త్వరగా కోలుకొని, ప్రజాక్షేత్రంలోకి రావాలని బొబ్బిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి డా గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో బొబ్బిలి టౌన్ పాత బొబ్బిలి శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జనసేన నాయకులు లెంక రమేష్, పెద్దింటి మనోజ్ (బాబీ), పైలా హరి,మరడానరవి,ఉల్లి సంతోష్,రేవలా కిరణ్,పేకెటి సురేష్,జమ్ము గణేష్,కొట్టేడ సురేష్,రేగానా సింబు, గొల్లపల్లి జాను,వీరమహిళలు బిగుల లక్ష్మీ, రామలక్ష్మి జన సైనికులు పాల్గొన్నారు.

## భోగాపురంలో పోషణ పక్వాడా కార్యక్రమం



భోగాపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : పరిధిలో గల లబ్దిదారులతో భోగాపురం 3 సెంటర్లో మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్యవాణి మాట్లాడుతూ పిల్లల అభివృద్ధికి ఫోన్స్ ఏవిధంగా అడ్డంకి గా మారుతున్నా యి, స్క్రీనింగ్ టైం ఏవిధంగా తగ్గించాలి అలా తగ్గించటం కోసం తల్లి దండ్రులు, కుటుంబం సభ్యులు, సమాజం ఎటువంటి పాత్ర పోషించాలి అనే వాటికోసం వివరించటం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ శ్రవంతి గారు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొనటం జరిగింది.

## ఘనంగా విమలాంబ ఈశ్వరిమాత వార్షికారాధన నగర సంకీర్తన




నెల్లిమర్ల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామంలో విమలాంబ ఈశ్వరి మాత అయిదవ వార్షికారాతన కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం నగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా జరిగింది. కీ. శే. విమలాంబ ఈశ్వరి మాత చిత్రపటాన్ని ప్రత్యేక పల్లకిలో ఉంచి గ్రామాల్లోని అన్ని వీధుల్లో ఊరేగింపు చేశారు. పలు నినాదాలు, గీతాలతో గంటల తరబడి ఊరేగింపు ఘనంగా కొనసాగింది. అనంతరం విమలాంబ ఈశ్వరి మాత సమేత శ్రీ అచలానంద పోలుబోతు రామారావు ఆర్యులు స్వగృహం వద్ద ఉన్న ఈశ్వరి మాత సమాధి వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత బోదానంద చింతల రాజశేఖర్ ఆర్యులు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈశ్వరి మాత విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జెండా ఆవిష్కరణ చేపట్టారు. తర్వాత రామారావు ఆర్యులు ఆధ్వర్యంలో విషయ నిర్ణయ సభ జరిగింది. కార్యక్రమంలో రామారావు ఆర్యులతోపాటు ముయుధ సత్యం ఆర్యులు, సదసత్ రహితానంద బండి వెంకటరమణ ఆర్యులు, పూర్ణానంద కొమ్మ వెంకటరమణ ఆర్యులు, పరిపూర్ణానంద ఆల్తి రామారావు ఆర్యులు, పొట్నూరు శ్రీనివాసరావు, పైడిరాజు పాల్గొని ప్రవచనం చేశారు. కార్యక్రమంలో జరజాపు పేట, కెంగువ, నడుపూరు, సీతారాంపురం, కెల్ల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

